నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

నేటి కందం-నేటికి అందం

వాడు కొనెడి గతి మెదడుకు
త్రీడీ యట్లాసు చేయు తీవ్రంపు కృషిన్
మోడీ గని గొప్పగ కొని
యాడెను విజ్ఞానధనుల యభిగమనంబున్ !!

(మానవుల మెదడుకు త్రీడీ అట్లాసు తయారు చేసి న్యూరో వైద్యంలో ఉపయోగించే కృషిని ప్రధాని మోడీ కొనియాడారు)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

అభివృద్ధి జరుగుతుంటే
అద్భుతంగా దేశమంతా
ఎటుచూసిన ఉద్యమాలు
ఎగిసిపడే దేనికింతా.
కార్పోరేట్ల గుప్పిటిలో
కేంద్రమైతే సంపదంతా
ఆర్థికంగా అసమానత
ఆవరించే ప్రజలచెంత.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 20-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:97 పేజీలు:68 వెల: రూ.1/-

ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే నంబర్‌వన్: నితిన్ గడ్కరీ



హైదరాబాద్, నవంబరు 19 ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే నంబర్‌వన్ అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యానించారు. ఇండియన్ రోడ్ నెట్‌వర్క్ ప్రపంచంలోనే నంబర్‌వన్ స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. మౌలిక వసతుల అభివృద్ధికి టెక్నాలజీ ఎంతో అవసరమని తెలిపారు. టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని చెప్పుకొచ్చారు.

ప్రపంచంలోని విజయవంతమైన మోడల్స్ అధ్యయనం చేయాల్సి వచ్చిందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాన్ని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రోడ్ల అభివృద్ధిలో కొత్త టెక్నాలజీపై ఇరువురు నేతలు చర్చించారు. రెండేళ్లలో రూ.93 వేల కోట్లతో రోడ్ల నిర్మాణమే టార్గెట్‌గా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుంది.


తెలంగాణను 3 రీజియన్లగా అభివృద్ధి: సీఎం రేవంత్‌రెడ్డి

ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. అభివృద్ధి మూలం మంచి రోడ్లు అని తెలిపారు ఓఆర్ఆర్‌తో హైదరాబాద్ అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.

తెలంగాణను మూడు రీజియన్లగా అభివృద్ధి చేశామని వివరించారు. సిటీ నుంచి మారుమూల గ్రామాలకు రోడ్ల కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా అత్యాధునిక ఆస్పత్రులను నిర్మిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

రహదారుల నిర్మాణాల్లో

ఎక్కడ రాజీ పడొద్దు: ఇంజినీర్లకు కేంద్రమంత్రి సూచన



హైదరాబాద్, నవంబర్19: రహదారుల నిర్మాణాల్లో నాణ్యత, భద్రత, మన్నిక విషయంలో ఎక్కడ రాజీ పడొద్దని ఇంజినీర్లను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కోరారు. కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లు, ఇంజినీర్లు పూర్తి బాధ్యత తీసుకుని సంపూర్ణంగా పూర్తి చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సమావేశాన్ని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంజినీర్లకు చురకలంటించారు. ఫ్లై ఓవర్ నిర్మించాల్సిన చోట నిర్మించం, అండర్‌పాస్ ఇవ్వాల్సిన చోట ఇవ్వం, జంక్షన్ల గురించి పట్టించుకోమని వారిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ఆ ప్రమాదాలకు మనమే బాధ్యులమని కేంద్ర మంత్రి గడ్కరీ స్పష్టం చేశారు. దీనిపై మీలో కచ్చితంగా బాధ్యతాయుతమైన ధోరణి రావాలని అన్నారు. అయితే కొంచెం కఠినంగా మాట్లాడి ఉంటే తనను క్షమించాలని ఇంజినీర్లను కోరారు. దేశ ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఐఆర్‌సీలోని ప్రతి ఇంజనీర్ నిబద్ధత, బాధ్యత, సహకారం తనకు కావాలని తెలిపారు. తెలంగాణ కోసం తన వంతుగా మీకు ఎంత సహాయం చేయగలనో అంత వరకు చేస్తానని రేవంత్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ భరోసా ఇచ్చారు.

'సర్' పై ప్రజా సదస్సు పోస్టర్లు విడుదల



హైదరాబాద్, నవంబర్ 19:(నేటినిజం ప్రతినిధి): "ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లు"అనే అంశంపై 22 నవంబర్ 2026 రోజున, ఖైరతాబాద్ లోని విశ్వేశ్వరయ్య భవన్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రజా సదస్సుకు సంబంధించిన పోస్టర్ ను, కరపత్రాన్ని ఇవ్వాళ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్ లో రాజ్యాం గబద్ధ ప్రజాస్వామిక వేదిక(FCD) విడుదల చేసింది. వేదిక కన్వీనర్ డాక్టర్ కె. రాంచంద్రమూర్తి, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదం డరాం, హైకోర్టు సీనియర్ న్యాయవాది కిరణ్మయి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తి బత్తిని లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: సీతక్క

హైదరాబాద్, నవంబర్19: రాష్ట్రంలో అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఫైలేరియా, ఎయిడ్స్, డయాలసిస్ బాధితులకు కొత్తగా చేయూత పథకం కింద 11,275 మందికి పింఛన్లు మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఫైల్‌పై గురువారం మంత్రి సీతక్క సంతకం చేశారు.

దీంతో 5,895 మంది ఫైలేరియా బాధితులకు, 3,024 మంది ఎయిడ్స్ బాధితులకు, 2,356 మంది డయాలసిస్ రోగులకు ఈ పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేయనుంది. నవంబర్ 26వ తేదీ రాజ్యాంగ దినోత్సవం. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఖాతాల్లో ఈ పింఛన్ నగదు జమ చేయనున్నారు. దీంతో రాష్ట్రంలో చేయూత పింఛన్లు తీసుకుంటున్న వారు 4,75,132కు చేరారు.

ఒకే వేదికపై ప్రముఖులు!



హైదరాబాద్, నవంబర్ 19: దేశ ఐక్యత కోసం భారతదేశ అంతర్జాతీయ ఉద్యమం హైదరాబాద్ సదస్సు=2026 ప్రారంభమైంది. కుంట్లూర్‌లోని జాస్సన్ గ్రామర్ స్కూల్ (ఐసీఎస్ఈ)లో జరిగిన ఈ కార్యక్రమాన్ని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. ప్రపంచ శాంతి, ఐక్యత, పరస్పర గౌరవం, సోదరభావం వంటి విలువల ప్రాముఖ్యతను వివరించారు.

భారతీయ సంస్కృతిలోని 'వసుధైవ కుటుంబకం' అనే గొప్ప భావనను గవర్నర్ ప్రస్తావించారు. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే ఆలోచనను యువత తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, శాంతి భావాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ.. వ్యసన రహిత జీవితాన్ని గడుపుతామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.మాజీ ఎంపీ డాక్టర్ కె. సురేష్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ శాంతియుత ఉద్యమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. యువతలో బాధ్యతాయుతమైన సంభాషణ, ఆలో చించి నిర్ణయాలు తీసుకునే స్వభావం, సమాజానికి ఉపయోగపడే నాయకత్వ లక్షణాలు పెంపొందాల్సిన అవసరాన్ని వివరించారు.స్విట్జర్లాండ్‌లోని బెర్న్‌లో భారత రాయబార కార్యాలయ మాజీ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్, కజకిస్థాన్‌కు భారత మాజీ రాయబారి డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ టీవీ సమకాలీన అంతర్జాతీయ పరిణామాలపై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక మార్పులు భారత్‌పై, ముఖ్యంగా యువత భవిష్యత్తుపై చూపే ప్రభావాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కుంట్లూర్ జాస్సన్ గ్రామర్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ బి. మల్లికార్జున రావు, డైరెక్టర్ డాక్టర్ బి. మాలతి రావు, రెక్టార్ డాక్టర్ కె. కళ్యాణి చారి, ప్రిన్సిపాల్ జి. శేషలక్ష్మి పాల్గొన్నారు. నాయకత్వం, దౌత్యం, సంస్కృతి, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి అంశాలపై వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకోవడంతో ప్రారంభ సమావేశం జరిగింది.

బిహార్‌లో ఘోర ప్రమాదం.. కాలువలోకి దూసుకెళ్లిన స్కార్పియో.. ఆరుగురి మృతి



న్యూ ఢిల్లీ, నవంబర్ 19:: బిహార్‌లోని అరేరియా జిల్లాలో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తారాబారి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీడీ వంతెన సమీపంలో వేగంగా వెళ్తున్న స్కార్పియో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్నవారు తేరుకునేలోపే వాహనం కాలువలో పడిపోయినట్లు సమాచారం. మృతులంతా సుపాల్ జిల్లాకు చెందినవారిగా తెలుస్తోంది. వీరంతా ఓ పెళ్లి వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది.

ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాలువలో పడిపోయిన వాహనం నుంచి బాధితులను బయటకు తీసేందుకు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఆరుగురి మృతితో బాధిత కుటుంబాల్లో విషాదం నెలకొంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల..

హైదరాబాద్, నవంబర్19: తెలంగాణలో ఇంటర్ వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు గురువారం హైదరాబాద్‌లో విడుదల చేసింది. 2027 ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 19వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

ఫిబ్రవరి 24 నుంచి ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి 25 నుంచి ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి 18వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఉద్యోగులకు గుడ్ న్యూస్..

న్యూ ఢిల్లీ, నవంబర్ 19: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ తన చందాదారులకు ఊరటనిచ్చేలా కీలక సంస్కరణలకు ఆమోదం తెలిపింది. పీఎఫ్ ఖాతాలోని సొమ్మును ఉపసంహరించుకునే పరిమితిని పెంచడంతో పాటు, ఉద్యోగం కోల్పోయిన వారు పూర్తి మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు వేచి ఉండాల్సిన సమయాన్ని గణనీయంగా తగ్గించింది. అలాగే పదవీ విరమణ తర్వాత పీఎఫ్ నిధిని ఒకేసారి కాకుండా నెలవారీ వాయిదాల్లో పొందే విధానాన్ని తీసుకొచ్చేందుకు కూడా నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనలకు ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (సీబీటీ) గురువారం ఆమోదముద్ర వేసింది.

55 ఏళ్లలోపు వయసున్న సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలోని నిధుల నుంచి ఉపసంహరించుకునే పరిమితిని గతంలో ఉన్న 75 శాతం నుంచి 90 శాతానికి పెంచారు. అంటే ఇకపై ఖాతాదారులు తమ పీఎఫ్ బ్యాలెన్స్‌లో కేవలం 10 శాతం మొత్తాన్ని నిల్వ ఉంచితే సరిపోతుంది. అత్యవసర ఆర్థిక అవసరాలు ఎదురైనప్పుడు తమ పొదుపు మొత్తంలో అధిక భాగాన్ని సులభంగా పొందేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడనుంది. ముఖ్యంగా అనుకోని ఖర్చులు, ఆర్థిక ఇబ్బందుల సమయంలో చందాదారులకు వెసులుబాటు కలగనుంది.

ఉద్యోగం కోల్పోయిన సభ్యులకు కూడా ఈపీఎఫ్ఓ కీలక ఊరటనిచ్చింది. ఇప్పటివరకు ఉద్యోగం పోయిన తర్వాత పూర్తి పీఎఫ్ మొత్తాన్ని ఉపసంహరించుకోవడానికి 12 నెలల నిరీక్షణ సమయం ఉండేది. తాజాగా ఈ గడువును రెండు నెలలకు తగ్గించింది. దీంతో ఉద్యోగం కోల్పోయిన వారు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న సమయంలో తమ పీఎఫ్ సొమ్మును త్వరగా పొందే అవకాశం లభించనుంది. కొత్త ఉద్యోగం దొరికే వరకు కుటుంబ అవసరాలను తీర్చుకోవడానికి ఈ నిర్ణయం కొంతమేర దోహదపడనుంది.

చైనాపై గూఢచర్యం చేస్తున్నాం.. డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

న్యూ ఢిల్లీ, నవంబర్ 19:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చైనాపై గూఢచర్యం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. చైనా కూడా అమెరికాలో గూఢచర్యం చేస్తోందని, వేగంలను పెట్టిందని చెప్పారు. చైనాలో జరుగుతున్న ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార (అపెక్) సదస్సులో ట్రంప్ పాల్గొననున్నారు. సదస్సులో పాల్గొనడానికి ముందు చైనాలోని షెంజెన్‌లోని మీడియాతో ట్రంప్ మాట్లాడారు. చైనా కన్నా తాము సమర్థంగా గూఢచర్యం చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా.. అమెరికా-ఇజ్రాయెల్‌తో యుద్ధంలో ఇరాన్‌కు చైనా సాయం చేస్తోందన్న ప్రచారాన్ని ట్రంప్ కొట్టివేశారు. ఇరాన్‌కు చైనా సాయం చేస్తే, ఆ విషయం వెంటనే తమకు తెలుస్తుందన్నారు.

వాస్తవానికి అమెరికాలో జరిగే పరిణామాల కన్నా చైనాలో జరిగే విషయాలే తమకు ఎక్కువగా తెలుస్తాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. 'అమెరికాలో గూఢచర్యం చేస్తున్నట్లు చైనా చెబుతోంది. చేయనివ్వండి. మేము కూడా చైనాలో గూఢచర్యం చేస్తున్నాం. ఇంటెలిజెన్స్ విషయంలో వారి కన్నా మేము ముందున్నాం. అయితే, దేనిపై గూఢచర్యం చేస్తున్నాం, ఎలా చేస్తున్నాం అనే విషయాలు వెల్లడించను' అని ట్రంప్ పేర్కొన్నారు.ఎన్విడియా వ్యవహారంపైనా ట్రంప్ స్పందించారు. ఎన్విడియా పరిణామాలను విషాదంగా ఆయన అభివర్ణించారు. ఆ సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్ మహా మేధావి అని, అలాంటి వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఆలిస్ హువాంగ్ చైనా గూఢచారి అన్న విషయం తనకెప్పుడూ తెలియలేదని అన్నారు.





బాలల హక్కుల పరిరక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

(20 నవంబర్ "ప్రపంచ బాలల దినోత్సవం" సందర్భంగా)

నేటి బాలలే రేపటి భావి ప్రపంచ పౌరులు. బాల్యం ఆనందాలకు చిరునామా. బాల్యం సున్నితం, బహు సుందరం. బాల్యం అద్వితీయ అనుభవాల నెలవు. అందరం బాల్యదశ నుండి ఎదిగిన వారమే. కుటుంబ సంతోషాలకు ప్రేరణ చిరునవ్వుల చిన్నారులు. పిల్లలకు ప్రశ్నించడం, తెలుసు కోవాలనే తపన ఉండడం గమనిస్తుంటాం.

సమాజంలో ఒక ప్రధాన భాగమైన బాలల భవితను సన్మార్గంలో నిర్మించాల్సిన కనీన బాధ్యత నేటి తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, పౌర సమాజంపై ఉన్నది. నేటి చిన్నారులకు కూడా మనతో సమానంగా మానవ హక్కులు ఉంటాయని గమనించాలి. నేడు బాల్యం ఛిద్రం అయితే రేపటి తరం నిర్వీర్యం అవుతుంది. నేటి బాలల అభ్యున్నతికి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు సాగితేనే బంగారు భవిష్యత్తు ఆవిష్కృతం అవుతుంది.

నేటి బాలలపై పెట్టుబడి రేపటి ఉజ్వల భవిష్యత్తుకు పునాది:

2వ ప్రపంచ యుద్ధం తర్వాత విశ్వ బాలల దీన పరిస్థితులను, ముఖ్యంగా యూరోప్ ప్రాంత చిన్నారుల మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడానికి ఐరాస అంగమైన యూనిసెఫ్ దిద్దుబాటు చర్యలకు పూనుకోవడం జరిగింది. నాడు బాలల హక్కుల పరిరక్షణ సదస్సులో తీసుకున్న తీర్మానం మేరకు పిల్లలకు మానవ హక్కులు ఉంటాయని, వాటిని అమలు చేయాలని, అవగాహన కల్పించాలని, చర్చించి తగు సమాధానాలు వెతకాలని, బంగారు బాటలు వేయాలనే పలు సదుద్దేశాలతో ప్రతి ఏట యూనిసెఫ్ నాయకత్వంలో 20 నవంబర్ రోజున ఐరాస సభ్య దేశాలు "ప్రపంచ బాలల దినోత్సం(వరల్డ్ చిల్డ్రన్స్ డే)" ఘనంగా నిర్వహించడం 1990 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ బాలల దినోత్సవం -2026 ఇతివృత్తంగా "నా రోజు, నా హక్కులు, నా భవిష్యత్తు(మై డే, మై రైట్స్, మై ఫ్యూచర్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. భారత్‌లో ప్రతి నవంబర్ 14న "జాతీయ బాలల దినాన్ని", 01 జూన్‌న ''అంతర్జాతీయ బాలల దినం'' కూడా పాటిస్తున్నామని మనందరికీ తెలుసు. పిల్లలకు చదువులతో పాటు ఆటపాటలు, లలిత కళల పట్ల ఆసక్తిని గమనించి శిక్షణను ఇవ్వడానికి పెద్దలు చొరవ చూపాలి.

ప్రపంచ బాలల ప్రధాన సమస్యలు:

ప్రపంచ బాలల హక్కులను నిర్లక్ష్యం చేయడం, అపార్థం చేసుకోవడం, కాలరాయడం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. నేటి బాలల సంక్షేమ చర్యలే రేపటి ప్రపంచ ఉజ్వల భవితకు రాచబాటలు మరిచిపోతున్నాం. ఆధునిక ప్రపంచ బాలలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పేదరికం, ఆకలి కేకలు, పోషకాహారలోపాలు, అవిద్య, సామాజిక మాధ్యమాల దురలవాటు, సహచరుల ఒత్తిడి, స్క్రీన్ టైమ్ అవలక్షణాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, చదువుల ఒత్తిడి, స్థూలకాయం, శారీరక ఎదుగుదల లోపించడం, అనవసర ఆందోళనలు, భావోద్వేగ సవాళ్లు, లైంగిక వేధింపులు, సురక్షిత నీటి కొరత, బాల కార్మిక అవస్థలు, లింగ-ఆధార హింస, యుద్ధ దేశాల్లో దుష్ప్రభావాలు, వలసల దుఃఖాలు, గృహ వసతులు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వాతావరణ మార్పులతో అనారోగ్యాలు, కాలుష్య ప్రతికూలతలు, కుటుంబ సమస్యలు, అక్రమ రవాణాలు, జాతి వివక్షలు, మానసిక సమస్యలు లాంటివి గుర్తించబడినవి.

బాలల హక్కులకు పట్టం కడదాం:

విశ్వ బాలల హక్కులు ఎలాంటి చర్చలను తావులేనివి. బాలల హక్కులను కావరాయడం అంటే రేపటి వారి ఉజ్వల భవిష్యత్తును పాతరేయడమే. నేడు, రేపు, భవిష్యత్తులో సదా ప్రపంచ మానవాళి సంతోషంగా ఉండాలంటే బాలల పెంపకంలో అతి శ్రద్ధ అనివార్యం. పిల్లల ఆలోచనలు విందాం. వారిలో దాగిన సృజనను ప్రోత్సహిద్దాం. వారి అనుమానాలను ఓపికగా నివృత్తి చేద్దాం. వారి సున్నిత మనసులను ఆప్యాయంగా ఆదరిద్దాం. తల్లితండ్రుల జీవన సాఫల్యత వారి పిల్లల ఎదుగుదల ప్రమాణాలపై మాత్రమే ఆధారపడి ఉంటుందని తెలుసుకుందాం. నేటి ప్రపంచ బాలల దినోత్సవ వేదిక ఆధారంగా సకల సౌకర్యాలను కల్పిస్తూ చిరు మొక్క వలె పంచుదాం, మహా వృక్షంగా ఎదిగి మరి కొందరికి నీడనిచ్చే స్థాయికి చేర్చుదాం. చిచ్చర పిడుగుల్లో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాలను పెంచుదాం. సృజనకు పట్టం కడదాం. కలలను సాకారం చేసుకునే విధంగా సౌకర్యాలను కల్పించాలి.

పసి పిల్లలు తోటలో మొగ్గల్లాంటి వారని, వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తే పరిమళ సుగంధ పుష్పాలుగా వికసిస్తారని గుర్తుంచుకుందాం. బాల్యాన్ని చిదిమేయడం అంటే రేపటి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే. కుటుంబం విచ్ఛిన్నమైతే విశ్వం వల్లకాడు అవుతుంది. మన బాలల్ని మనసారా ప్రేమించడం అంటే వారి పెంపకంలో అత్యంత శ్రద్ధ వహించడమే. నేటి ప్రపంచ బాలల్ని రేపటి విశ్వ నాయకుల స్థాయికి చేర్చడానికి మనందరం నిచ్చెనగా నిలబడదాం, తడబడినపుడు ఊతకర్రగా నిలుద్దాం.



-మధుపాళీ
9949700037

ప్రభుత్వ అధినేతగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ..

"ఓ ఉద్యమంగా నాయకత్వం" అంశంపై తొలి జాతీయ వర్క్‌షాప్ నిర్వహించిన నీతి ఆయోగ్

న్యూఢిల్లీ, నవంబర్ 19: ప్రభుత్వ అధినేతగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఆయన నుంచి నేర్చుకోవలసిన విషయాలపై ఓ జాతీయ కార్యశాల (వర్క్‌షాప్)ను నీతి ఆయోగ్ న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ రోజు నిర్వహిస్తోంది. "ఓ ఉద్యమంగా నాయకత్వం" అనే అంశాన్ని ఈ వర్క్‌షాపునకు ఇతివృత్తంగా ఎంపిక చేశారు. ప్రధానమంత్రి 2001 అక్టోబర్‌లో గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలను స్వీకరించారు. దేశ ప్రధానమంత్రిగా 2014 మే నెలలో ఆయన బాధ్యతలను చేపట్టారు. అప్పటి నుంచి రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో విరామం తీసుకోకుండా ప్రభుత్వానికి సారథ్యం వహిస్తూవస్తున్నారు. ఆయన తన పదవీకాలం పర్యంతం ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సేవాప్రధానమైన ఉద్యమంగా పరిగణిస్తున్నారు. తాను ప్రధాన సేవకుడిని అని చెప్పుకొన్నారు. ఈ భావన ప్రభుత్వంలోని ప్రతి పదవిలోనూ పౌరులనే ప్రధాన కేంద్ర బిందువుగా నిలబెడుతున్నది. అలాగే అంత్యోదయ, ప్రజల భాగస్వామ్యం, 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్' సిద్ధాంతాలు కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వం ఏ దిశగా ముందుకు సాగాలో మార్గదర్శనం చేశాయి.

జాతీయ స్థాయిలో అయిదు భాగాల వర్క్‌షాపును నిర్వహించాలని ప్రతిపాదించారు. వాటిలో ప్రస్తుత వర్క్‌షాప్ ఒకటోది.

ఈ అయిదు వర్క్‌షావులలోనూ జరిపే చర్చలు, వెల్లడి అయ్యే అనుభవాల్ని ఆధారం చేసుకొని సివిల్ సర్వీసుల శిక్షణాసంస్థలు, విద్యాసంస్థలతో పాటు విశ్వవిద్యాలయాలలో కూడా తగ్గ బోధన సామగ్రిని, కేస్ స్టడీలను రూపొందించనున్నారు. వర్క్‌షావులు పురోగమించే క్రమంలో, ఈ ఇరవై అయిదేళ్ల నేర్పే అంశాలను పరిశోధన, బోధన సామగ్రి ద్వారా ముందుకు తీసుకుపోతారు. ఇవి 2047 కల్లా 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం)ను సాధించడానికి రాబోయే సంవత్సరాల్లో విధాన పరంగాను, పాలన పరంగాను అనుసరించాల్సిన బాటను ఖరారుచేస్తాయి.

నేడు నిర్వహించిన కార్యశాలలో 900 మందికి పైగా పాలొన్నారు. వారిలో 250 మంది చర్చలలో పాలుపంచుకొని, తమ అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు. వర్క్‌షాపులో పాలుపంచుకున్న వారిలో కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కార్యదర్శులు, సీనియర్ అధికారులు, అభివృద్ధి కోసం తపిస్తున్న జిల్లాల కలెక్టర్లు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల విద్యార్థులు, సాముదాయిక భాగస్వాములు, జాతీయ స్థాయి ప్రధాన పథకాల లబ్ధిదారులు ఉన్నారు. చర్చాక్రమాన్ని ఐజీఓటీ కర్మయోగి వేదికలో, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర పాలనా సంబంధ శిక్షణ సంస్థలలో దృశ్యమాధ్యమం ద్వారా ప్రసారం చేశారు. దీంతో దేశం నలుమూలల నుంచి అధికారులకు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొనేందుకు అవకాశం లభించింది.

వర్క్‌షావులో ముందుగా జాతీయ గేయాన్ని, జాతీయ గీతాన్ని ఆలపించారు. తరువాత నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ అమితాబ్ కాంత్ స్వాగతోపన్యాసాన్ని ఇచ్చారు. గౌరవనీయ ప్రధానమంత్రి 25 సంవత్సరాల నాయకత్వం నుంచి నేర్చుకోవలసిన విషయాలను తెలియజెప్పడంతో పాటు, ఆ అంశాలను భవిష్యత్తులో అనుసరించవలసిన సంస్థాగత జ్ఞాన భాండాగారంగా రూపొందించడం కూడా ఈ వర్క్‌షావ్ ధ్యేయమని ఆయన వివరించారు.

నాయకత్వ ప్రస్థానం అందిస్తున్న నాలుగు ప్రధాన పాఠాలను నీతి ఆయోగ్ సీఈఓ పేర్కొన్నారు. ఒకటో పాఠం.. అధికార పదవి కన్నా పరమార్థానిదే పైచేయి కావాలని, వ్యక్తిగత సారథ్యం నుంచి ఉమ్మడి ఉద్యమ పథంలో పురోగమించడంపై దృష్టిని కేంద్రీకరించాలని చెబుతుంది. రెండోది, ప్రభుత్వ అధిపత్యానికి బదులు సేవకు ప్రాముఖ్యాన్ని ఇచ్చితీరాలని, పాలన వ్రాలను వరుసలోని ఆఖరి వ్యక్తికి కూడా అందించేందుకు పెద్ద పీట వేయాలని సూచిస్తుంది. మూడో పాఠం సవాళ్లను దీటుగా ఎదుర్కొనే శక్తిని ప్రబల నమ్మకం పెంపొందింప చేస్తుందని, ప్రతికూల స్థితిని అయినా సరే సమాజంలో పరివర్తనను తీసుకువచ్చేందుకు ఒక అవకాశంగా మలచుకోవడానికి తోడ్పడుతుందని చాటుతుంది. ఇక నాలుగో పాఠం బలమైన సంస్థలు, దక్షత గల బృందాలు, సుస్థిర వ్యవస్థల సాయంతో వ్యక్తిగత నాయకత్వం కన్న వాస్తవిక సాధికారత కల్పన పరమార్థం కావాలని బోధిస్తుందని నీతి ఆయోగ్ సీఈఓ తెలిపారు.

నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ శ్రీ అశోక్ కుమార్ లాహిరి ప్రారంభోపన్యాసాన్నిస్తూ, "భారతదేశ అభివృద్ధిని ముందుకు తీసుకుపోయే క్రమంలో దృఢమైన రాజకీయ, పాలన సంబంధిత నేతృత్వం పోషించాల్సిన పాత్ర ఎంతో కీలకం. మన గౌరవనీయ ప్రధానమంత్రి పరివర్తన ప్రధాన దృష్టికోణం 2047 కల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ రూపొందాలన్న జాతీయ ఆకాంక్షను చాటుతోంది. ఇది దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగాను, సంపన్న దేశంగాను, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే దేశంగాను మార్చనుంద"న్నారు.

భారతదేశాన్ని 2047 కల్లా 30 నుంచి 40 లక్షల కోట్ల అమెరికా డాలర్ల విలువ కలిగిన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటున్న నీతి ఆయోగ్ ఏకీకృత కార్యాచరణను శ్రీ లాహిరి ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2047 కల్లా భారత్‌లో తలసరి ఆదాయం 15,000 నుంచి 18,000 అమెరికా డాలర్లకు వృద్ధి చెంది, నిరంతర ప్రాతిపదికన వార్షిక వాస్తవిక జీడీపీ వృద్ధి రేటు 7 నుంచి 10 శాతం మధ్య నమోదు అవ్వాలనేది ధ్యేయమని ఆయన వివరించారు.

ప్రధానమంత్రికి ప్రిన్సిపల్ సెక్రటరీ అయిన డాక్టర్ పి.కె. మిశ్రా కీలక ప్రారంభో పన్యాసాన్నిస్తూ, "భారత పాలన ప్రస్థానంలో అనేక ప్రధాన మజిలీలున్నాయి. ఇవి నిర్ణయాత్మక నాయకత్వ శక్తి, దూరదృష్టి కలిగిన కార్యాచరణగా మారే సామర్థ్యాన్ని చాటి చెబుతున్నాయి. 2001లో కచ్‌లో భూకంపం సంభవించినప్పుడు సత్వర ప్రతిస్పందన మొదలు కోవిడ్-19 మహమ్మారి పట్ల దేశమంతా ఏకతాటిపై నిలబడి స్పందించిన తీరు వరకు.. అలాగే, ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో భారత ఉనికి వృద్ధి చెందడం మొదలు 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ప్రవరించిన వరివర్తనాత్మక ప్రభావం వరకు.. పరిశీలిస్తే ఈ విజయాలన్నీ బలమైన రాజకీయ సంకల్పం, బాధ్యతాయుత పాలనాయంత్రాంగం, లక్ష్యం దిశగా దూసుకుపోయే పాలన ప్రజల జీవితంలో అర్థవంతమైన మార్పును తీసుకురాగలు గుతాయ"న్నారు.

కోటక్ మహీంద్రా బ్యాంకు వ్యవస్థాపకుడు శ్రీ ఉదయ్ కోటక్ మాట్లాడుతూ, "మాన్య ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సార థ్యానికి, అలాగే మొదట గుజరాత్ ముఖ్యమంత్రిగాను, తరువాత భారతదేశ ప్రధానమంత్రిగాను, ఔత్సాహిక పారిశ్రామికత్వాన్ని ఆర్థిక అభివృద్ధికి, దేశ నిర్మాణానికి ప్రధాన చోదకశక్తిగా నిరంతర గుర్తింపు లభించింది. సహాయక వ్యవస్థలకు సంస్థాగత రూపును ఇవ్వడం, ఆర్థిక-ఔత్సాహిక పారిశ్రామికత్వ విస్తారిత అనుబంధ వ్యవస్థ పటిష్టికరణ, చైతన్యవంతమైన అంకుర వ్యవస్థ ఆవిర్భావం.. ఈ పరిణామాలు కూడా ఈ నిబద్ధతనే సూచిస్తున్నాయ"న్నారు.

వర్క్‌షాపు రూపురేఖలు, స్వరూపాన్ని నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణియమ్ వివరించారు. వర్క్‌షావులో నాయకత్వాన్ని అది వ్యక్తమయ్యే నిర్ణయాలు, పనుల ఆధారంగా పరిశీలిస్తారని, రోజంతా చేపట్టిన కార్యక్రమాల నుంచి సంపాదించిన అనుభవా న్ని విశ్లేషించి, ఆ విశ్లేషణ నుంచి కార్యాచరణ వైపు సాగిపోయేటట్లు చూస్తారన్నారు. కార్యక్రమాలను అయిదు దశలుగా విభజించారు. ఆ దశల్లో.. నేర్చుకోవడం, విశ్లేషించడం, మననం చేసుకోవడం, అమల్లో పెట్టడం, నిబద్ధతతో నడుచుకోవడం వంటివి ఉన్నాయి. ఈ దశలలో భాగంగా వర్క్‌షావులో పాల్గొన్న వారు కీలక నిర్ణయాలతో ముడిపడిన వాస్తవిక జీవితానుభవాల నుంచి నేర్చుకున్నారు. ప్రభుత్వ ప్రముఖులు, విద్యారంగ ప్రముఖులు, పౌరులతో కలసి చర్చల రూపంలో వాటిని విశ్లేషించారు. ప్రజా నాయకత్వం తాలూకు దీర్ఘకాల ప్రాతిపదిక కలిగివుండే పద్ధతులపై చర్చించారు. ఇలా నేర్చుకున్న విషయాలను తమ విధుల్లో ఎదురయ్యే సవాళ్లకు వర్తింపచేశారు. తమ నాయకత్వ పద్ధతులలో విశిష్ట మార్పు చేసుకోవడానికి నిబద్ధతను ప్రోది చేసుకున్నారు. భారతీయ నిర్ణయాలు, సంస్థలపై ఆధారపడి న ప్రజా నాయకత్వానికి జ్ఞానంతో ముడిపెట్టిన ఒక భారతీయ భాండాగారాన్ని రూపొందించడం ఈ వర్క్‌షాపు ఉద్దేశమని ఆయన వివరించారు. ఆ భాండాగారం 2047 కల్లా 'వికసిత్ భారత్' దిశగా ముందడుగు వేసే కాలంలో సివిల్ సేవకులకు అందించాల్సిన శిక్షణ పద్ధతులతో పాటు నాయకత్వ పద్ధతులను కూడా రూపొందిస్తుందని డాక్టర్ ఆర్. బాలసుబ్రమణియమ్ అన్నారు.

'లీడర్‌షిప్ మూవ్‌మెంట్స్' సమావేశంలో, నలుగురు వక్తలు కీలక క్షణాలలో తమ ప్రత్యక్ష అనుభవాలు, వాటి నుంచి నేర్చుకున్న పాఠాలను వివరించారు.

గుజరాత్ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, ఆ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం ప్రిన్సిపల్ కార్యదర్శి శ్రీ రాజీవ్ టాప్నో మాట్లాడుతూ 2001వ సంవత్సరంలో కచ్ భూకంపం కేవలం సామాన్య స్థితిని పునరుద్ధరించే గాథ కాదని, ప్రజల భాగస్వామ్యం, సంస్థాగత పటిష్టికరణ, సామూహిక సంకల్పం ద్వారా ఒక నూతన వ్యవస్థను ఏర్పరిచే గాథ అని తెలిపారు. ఈ అనుభవం ప్రభావవంతమైన పాలనకు సంబంధించిన నాలుగు మూల స్తంభాలను ప్రస్తావించిందని, దృక్పథంలో స్పష్టత, నిర్ణయాత్మకత, సంఘీభావం, నిబద్ధత, ప్రభుత్వ సహకారంతో ప్రజలు భాగం పంచుకోవడానికి ముందంజ వేయడం, బలమైన సంస్థా నిర్మాణం అనేవే ఆ మూలస్తంభాలని ఆయన వివరించారు.

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి, యూపీఎన్‌సీపూర్వ చైర్‌పర్సన్, మహమ్మారి సన్నద్ధత, ప్రతిస్పందన విషయాలపై ఏర్పాటు చేసిన ఒక స్వతంత్ర బృందంలో పూర్వ సభ్యురాలు ప్రీతి సూదన్ మాట్లాడుతూ, గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం కోవిడ్-19 స్పందనను ఒక సమగ్ర ప్రభుత్వ దృష్టికోణం నుంచి ఒక సమగ్ర సాహాజిక ఉద్యమంగా మార్పు చెందిందన్నారు. వైద్యులు, నర్సులు, మొదటి అంచెలో సేవలందించే వారి సురక్షకు ప్రాధాన్యాన్నిస్తూ, సాంకేతికతను వెన్నెముకగా చేసుకొని, ప్రజా ఉద్యమాల రూపంలో జన భాగస్వామ్యానికి వేగాన్ని జతచేసి భారత్ సమన్వయపూర్వక ప్రతిస్పందనను కనబరిచిందని ఆమె అన్నారు. 'వ్యాక్సీన్ మైత్రి' కార్యక్రమాన్ని అమలుపరిచి, 100కు పైగా దేశాలకు సుమారు 30 కోట్ల టీకా మోతాదులను సరఫరా చేసిన భారత్ అంతర్జాతీయ సంఘీభావం పట్ల నిబద్ధతను మరింత ఎక్కువగా చాటుకొందని ప్రీతి సూదన్ వివరించారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి శ్రీ శైలేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, "ఒక పనిని ఇంతకు ముందు ఎన్నడూ ఎరుగనంత విస్తృత స్థాయిలో కార్యరూపంలోకి తీసుకురా వచ్చునే దానికి 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ఓ ఉదాహరణగా నిలిచింది. గౌరవనీయ ప్రధాన మంత్రి గ్రామ ప్రాంతాలకు చెందిన మహిళలను ఔత్సాహిక పారిశ్రామి కవేత్తలుగాను, ఉత్పాదకులుగాను, సేవల సరఫరా దారులుగాను గుర్తించి ఈ కార్యక్రమానికి ఒక స్పష్టమైన, మహత్వాకాంక్ష కలిగిన లక్ష్యాన్ని నిర్ధారించారు. 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమం ఆదాయాన్ని అందించడానికి మాత్రమే పరిమితం కాదు, అది ఈ మహిళలకు తమ కుటుంబాల దృష్టిలో, సమాజం దృష్టిలో ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, గౌరవాన్ని, గుర్తింపును కట్టబెట్టడానికి సంబంధించింది. నా అభిప్రాయంలో ఇది దీని విశాల లక్ష్యమ"న్నారు.

ఇస్రో పూర్వ చైర్మన్, కేంద్ర అంతరిక్ష విభాగం పూర్వ కార్యదర్శి డాక్టర్ ఎస్. సోమనాథ్ మాట్లాడుతూ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) నియమాలలో మార్పులు ప్రయివేటు రంగ ప్రాతినిధ్యానికి ఎలా కొత్త బాటలను పరిచాయో వివరిం చారు. దీంతో ఆర్థిక వ్యవస్థకు తోడ్పడే రంగాలలో ఒక కీలక రంగంగా అంతరిక్ష రంగం లెక్కలోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఇస్రో తన నైపుణ్యా లను, మౌలిక వసతులను, సదుపాయాలను ప్రయివేటు సంస్థల అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా ఈ మార్పునకు మార్గాన్ని సుగమం చేయడంలో ఒక కీలక పాత్రను పోషిస్తోందని డాక్టర్ సోమనాథ్ స్పష్టం చేశారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

పేద ప్రజల అభివృద్ధికి విశేష కృషి చేశారు
కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి



ఆదిలాబాద్, నవంబర్ 19: దేశానికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర నందునాయక్ అన్నారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం ఇందిరాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల అభివృద్ధి కోసం ఇందిరాగాంధీ ఎంతో కృషి చేశారని, ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఇందిరాగాంధీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన్నారం ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసిహుల్లా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇసాక్, జిల్లా కార్యదర్శి ముజఫర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సోహేల్ షా, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దాసరి గణేష్, నాయకులు మచ్చ శంకరయ్య, జక్కు భూమేష్, ముత్యం రాజన్న, దామోక కరుణాకర్, ఎం. ఇందయ్య, డి. రమేష్, కమలాకర్ రావు, రాజేశ్వర్, షాకీర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్యే బొజ్జు పటేల్
బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి
ఇందిరమ్మ జీవిత బీమా పథకంతో కుటుంబ పెద్దలకు రూ.5 లక్షల బీమా

ఆదిలాబాద్, నవంబర్ 19: భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని కొనియాడారు. ఆమె ఆశయాలను కొనసాగించే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు అందని అర్హులు అధైర్యపడవద్దని, వారికి తప్పకుండా పథకాల ప్రయోజనాలు అందేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అర్హులైన వారికి బీడీ, వృద్ధాప్య పింఛన్లు అందడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. అనర్హులను గుర్తించి తొలగించిన అనంతరం అర్హులకు పింఛన్లు మంజూరవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామడుగు రమేష్ రావు, తహసీల్దార్ యాదవ రావు, ఎంపీడీఓ సయ్యద్ జవేద్ అలీ, పంచాయతీరాజ్ డీఈ సూర్య తేజ, జేఈ చందన్, ఎంపీవో రమేష్ రెడ్డి, సర్పంచులు లలిత రాజేష్, గోపాల్, కోలా మహేష్, నరేష్, రాజేష్, పద్మ కళ్యాణ్, సురేందర్, ఉప సర్పంచులు రాములు, మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్ సామ ప్రభాకర్ రెడ్డి, జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంతరావు, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ నిసార్, ఉట్నూర్ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్, ఉప సర్పంచ్ అఫ్రద్ బేగం అన్సారీతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకొండపేటలో నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

ఆదిలాబాద్, నవంబర్ 19:: దస్తూరాబాద్ మండలం అకొండపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాడి మాధవి శంకర్‌ను కుర్చీలో కూర్చోబెట్టి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు అందని అర్హులు అధైర్యపడవద్దని, వారికి తప్పకుండా పథకాల ప్రయోజనాలు అందేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అర్హులైన వారికి బీడీ, వృద్ధాప్య పింఛన్లు అందడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. అనర్హులను గుర్తించి తొలగించిన అనంతరం అర్హులకు పింఛన్లు మంజూరవుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామడుగు రమేష్ రావు, తహసీల్దార్ యాదవ రావు, ఎంపీడీఓ సయ్యద్ జవేద్ అలీ, పంచాయతీరాజ్ డీఈ సూర్య తేజ, జేఈ చందన్, ఎంపీవో రమేష్ రెడ్డి, సర్పంచులు లలిత రాజేష్, గోపాల్, కోలా మహేష్, నరేష్, రాజేష్, పద్మ కళ్యాణ్, సురేందర్, ఉప సర్పంచులు రాములు, మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు చందనోత్సవాలకు పటిష్ట బందోబస్తు

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి -జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



కరీంనగర్, నవంబర్ 19: కొండగట్టు శ్రీ అంజనేయస్వామి చందనోత్సవాలకు వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని సురక్షితంగా తిరిగి వెళ్లేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. చందనోత్సవాల సందర్భంగా ఈ నెల 20వ తేదీ నుంచి డిసెంబర్ 29వ తేదీ వరకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గురువారం పోలీస్, ఇతర శాఖల అధికారులతో కలిసి కొండగట్టు ఆలయ పరిసర ప్రాంతాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఆలయ పరిసరాల్లో నిరంతరం నిఘా ఉంచాలని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. భక్తులు తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపేలా చూడాలని సూచించారు. ప్రధాన రహదారులు, ఆలయానికి వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, మల్యాల సీఐ రాజ్ కుమార్, ఎస్ఐలు సందీప్, నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అపర్ణ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలి -మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

ఆదిలాబాద్, నవంబర్ 19: నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన మేదారం అపర్ణ ప్రదీప్ గురువారం పలువురు నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి శ్రీహరి రావు, మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్యా గణేష్‌లను ఆమె కలిశారు.ఈ సందర్భంగా మాజీమంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మహిళా విభాగం కృషి చేయాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన అపర్ణ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

"లక్ష్యసాధన నాయకత్వం"పై నీతి ఆయోగ్ జాతీయ కార్యశాలలో కర్మయోగి సంకల్పను ప్రారంభించిన కేబినెట్ కార్యదర్శి



న్యూ ఢిల్లీ, నవంబర్ 19:న్యూఢిల్లీలోని భారత మండపంలో ''లక్ష్యసాధన నాయకత్వం"పై నీతి ఆయోగ్ నిర్వహించిన జాతీయ కార్యశాల ముగింపు సమావేశంలో ఐగాట్ కర్మయోగి వేదికపై కర్మయోగి సంకల్పను కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టి. వి. సోమనాథన్ ఇవాళ ప్రారంభించారు. ప్రభుత్వాధినేతగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇరవై అయిదేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా నీతి ఆయోగ్ నిర్వహిస్తున్న అయిదు జాతీయ కార్యశాలల శ్రేణిలో ఇది మొదటిది.

కర్మయోగి సంకల్పం ద్వారా ప్రతి సివిల్ సర్వెంట్ సొంత నాయకత్వ పద్ధతుల్లో నిర్దిష్ట మార్పు కోసం ప్రతిజ్ఞ చేస్తారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా ఆఫీసర్ ఎక్కడ పని చేస్తారు, ఏ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటారు, పౌరులకు ఎలాంటి మార్పు కనిపిస్తుంది, ఎలాంటి చర్యలు తీసుకుంటారనే వివరాలను స్పష్టం చేస్తారు. భారత మండపం, ఐగాట్ కర్మయోగి వేదిక ద్వారా పాల్గొన్న అధికారులు ఈ ప్రారంభ సమయంలో సంకల్పాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ అధికారుల ప్రతిజ్ఞలను కర్మయోగి భారత్ పర్యవేక్షిస్తుంది. డిసెంబర్ 25, 2026న సుపరిపాలనా దినోత్సవం సందర్భంగా ఈ వేదికలో 25,000 సంకల్పాలను నమోదు చేయాలనే లక్ష్యంతో మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, శిక్షణ సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తారు.

ప్రధానమంత్రి ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మిశ్రా కీలక ఉపన్యాసంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 2001 భూకంపం తర్వాత కచ్ పునర్నిర్మాణం, కొవిడ్-19 మహమ్మారికి ప్రతిస్పందన, లఖ్‌పతి దీదీ, అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై స్వీయ అనుభవాలను పంచుకున్నారు. కేస్ క్లినిక్‌లో, ప్రతి బృందం తమకు కేటాయించిన ఎపిసోడ్ నుంచి ఒక నిర్ణయాన్ని పరిశీలించింది. ఆ నిర్ణయంలో ప్రజానీకానికి ఏది అవసరం, దానికి వ్యతిరేకంగా ఏం ఉంది? నిర్ణయం అమల్లో ఉద్దేశానికి అనుగుణంగా ఎలా కట్టుబడి ఉందనే అంశాలను విశ్లేషించారు.

"వికసిత్ భారత్ కోసం నాయకత్వం" అంశంపై నీతి ఆయోగ్ మాజీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) శ్రీ బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం మధ్యవర్తిగా ఒక ప్యానెల్ చర్చ జరిగింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ పట్టణాభివృద్ధి, ఇంధన శాఖ కేబినెట్ మంత్రి శ్రీ అరవింద్ కుమార్ శర్మ, ఐఐఎం అహ్మదాబాద్ ప్రొఫెసర్ విశాల్ గుప్తా, నాస్కామ్ మాజీ అధ్యక్షురాలు, నీతి ఆయోగ్ విశిష్ట ఫెలో శ్రీ దేబ్జాని ఘోష్, ఉత్తరప్రదేశ్ హార్డ్‌కోయ్ జాయింట్ మేజిస్ట్రేట్ శ్రీ నారాయణి భాటియా ఈ ప్యానెల్ చర్చలో వక్తలుగా పాల్గొన్నారు.

గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వ సూత్రాలు, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించటంలో వాటి ప్రాముఖ్యత గురించి ప్యానెల్ సభ్యులు అభిప్రాయాలను పంచుకున్నా రు.ప్రధాన మంత్రి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పరిపాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పును శ్రీ అరవింద్ కుమార్ శర్మ ఈ సందర్భంగా ప్రస్తావించారు. నూతన విధానాలను రూపొందించటంలో, సంస్థలను, మానవ వనరుల సామర్థ్యాన్ని పెంపొందించటంలో, స్థానిక కమ్యూనిటీలను అభివృద్ధికి కేంద్రంగా మలచటంలో ప్రధానమంత్రికి గల ప్రత్యేక సామర్థ్యాన్ని ఆయన స్పష్టం చేశారు.

ప్రొఫెసర్ విశాల్ గుప్తా మాట్లాడుతూ... ప్రతిష్టాత్మక లక్ష్యాలపై విశ్వాసాన్ని కలిగించే ప్రధానమంత్రి సామర్థ్యాన్ని వివరించారు. రాజకీయ సంకల్పానికి తగినట్లుగా పరిపాలనా సంస్కరణలు కూడా జరగాలని చెప్పారు. సేవా భావం నాయకత్వానికి ప్రధాన సూత్రమని కొనియాడారు.

సాంకేతికతను ఎల్లప్పుడూ ప్రజలపై, సమాజంపై చూపే ప్రభావం ద్వారానే అంచనా వేయాలని దేబ్జాని ఘోష్ అభిప్రాయపడ్డారు. ఏఐ, సాంకేతిక పురోగతి మానవ కేంద్రీకృత దృక్పథంతో ఉండాలని, నూతన ఆవిష్కరణలు సార్థకమైన సామాజిక మార్పునకు దోహదపడేలా చూడాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రధానమంత్రితో ఉన్న పార్శ్వ ఆలోచనా విధానాన్ని, ఒకదానికొకటి ముడిపడున్న అవకాశాలను గుర్తించే నేర్పును నారాయణీ భాటియా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా ఆయన ఆచరించే శ్రవణ, సానుభూతి గుణాలను ఆమె అభినందించారు. యువ అధికారులతో సహా అందరికీ అభిప్రాయాలను పంచుకునేందుకు తగిన అవకాశాన్ని, స్వేచ్ఛను ఇవ్వటం ఆయన నాయకత్వంలోని అత్యంత విలువైన లక్షణాల్లో ఒకటని ఆమె పేర్కొన్నారు.

అప్లికేషన్ క్లినిక్‌లో కేస్ క్లినిక్ ద్వారా నేర్చుకున్న అంశాలను ప్రభుత్వాధికారులు ప్రస్తుతం పనిచేస్తున్న పోస్టింగ్స్‌లో ఎదురవుతున్న వాస్తవ నాయకత్వ సవాళ్లకు అన్వయించారు.

ముగింపు సదస్సులో నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రమణ్యం ఆ రోజు జరిగిన కార్యకలాపాల సంక్షిప్త నివేదికను అందజేశారు. అదనంగా వివిధ బృందాలు పలు సవాళ్లకు సంబంధించిన అప్లికేషన్లను సమర్పించాయి. మారుమూల గిరిజన ప్రాంతాల్లో మాతృ సంరక్షణను పర్యవేక్షించేందుకు, నిలకడగా కొనసాగించేందుకు ఉద్దేశించిన ఏఎస్ఆర్ సాథీ - సేఫ్ అంటెనాటల్ అసిస్టెన్స్, అసంక్రమిత వ్యాధులకు సార్వత్రిక ఆరోగ్య సంరక్షణను అందించేందుకు క్లోజ్డ్-లూప్ రిఫెరల్ మార్గాలను అమలు చేయటం, ఎస్‌హెచ్‌జీ సంస్థలు లఖ్‌పతి దీదీ ఆదాయాన్ని నిలకడగా కొనసాగించేలా ప్రతి సరస్ మేళా ద్వారా ఏడాది పొడవునా కొనుగోలుదారుల హామీలు లభించేలా చేయటం, ఎస్‌బీఎం-జీ ద్వారా మురికి నీటి నిర్వహణ ఆస్తుల ప్రారంభ, దీర్ఘకాలిక పనితీరును నిర్ధారించటం వంటి అంశాలపై ఈ అప్లికేషన్లను సమర్పించారు.

సమావేశం ముగింపు సందర్భంగా కేబినెట్ కార్యదర్శి డాక్టర్ టి.వి. సోమనాథన్ మాట్లాడారు. "నాయకత్వ పాఠాలను విద్యా కోర్సులు, పరిశోధనల ద్వారా అధ్యయనం చేయవచ్చు. అత్యంత విలువైన పాఠాలు సమర్థులైన నాయకులను గమనించటం, వారితో కలిసి పనిచేయటం ద్వారానే వస్తాయి" అని పేర్కొన్నారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వంటి నాయకులతో కలిసి పనిచేసిన అనుభవాన్ని ఉదాహరణగా చూపుతూ... సివిల్ సర్వెంట్లు అలవర్చుకోవాల్సిన కీలక పరిపాలనా నాయకత్వ పద్ధతులను ఆయన ప్రస్తావించారు. ఈ కార్యశాల ద్వారా నేర్చుకున్న పాఠాలను కర్మయోగి సంకల్ప క్షేత్రస్థాయిలోకి తీసుకువెళుందని ఆయన తెలిపారు. సమర్థులైన నాయకుల అనుభవం ద్వారా మాత్రమే ప్రభావవంతమైన నాయకత్వాన్ని అర్థం చేసుకోవచ్చని డాక్టర్ సోమనాథన్ స్పష్టం చేశారు. వారి పరిపాలనా నైపుణ్యాల నుంచి నేర్చుకోవాల్సిన ప్రాముఖ్యతను ఆయన వివరించారు.సమర్థవంతమైన పరిపాలనా నాయకత్వం అంటే.. సముచితమైన ప్రశ్నలు వేయటం, శ్రద్ధగా ఆలకించటం, దృఢమైన నిర్ణయాలు తీసుకోవటం, జవాబుదారీతనం పాటించటం, నిబంధనలకు కట్టుబడి ఉండటం ద్వారా ఒక నిర్దిష్ట దృష్టిని కొలవదగిన ఫలితాలుగా మార్చటమేనని ఆయన తెలిపారు.

ఈ బృందాల విశ్లేషణను కేస్ స్టడీలుగా కేస్ రైటర్లు రూపొందిస్తారు. సివిల్ సర్వెంట్లు, శిక్షణ సంస్థలు వినియోగించుకునేలా ఐగాట్ కర్మయోగి వేదికపై ప్రచురిస్తారు. ప్రతి బృందం రూపొందించిన ప్రణాళికలు, కర్మయోగి సంకల్ప్ ద్వారా తీసుకున్న ప్రతిజ్ఞలు ఈ కార్యశాల అభ్యాసాలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్తాయి. "పరిపాలనా ప్రయోజనాలను ప్రజలకు చేర్చటం" అనే అంశంపై తదుపరి జాతీయ కార్యశాల 2027 జనవరిలో జరుగుతుంది. నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ అనురాగ్ జైన్ కృతజ్ఞతలు తెలియజేసి కార్యశాలను ముగించారు.

జీవవైవిధ్యానికి గిరిజన సమాజాలే రక్షకులుగా ఉన్నాయి: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, నవంబర్ 19:భారతదేశ శాస్త్రీయ, ఆవిష్కరణల ప్రయాణంలో గిరిజన వర్గాలు భాగస్వాములుగా, నాయకులుగా ఉండాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల మంత్రిత్వ శాఖ, అణుశక్తి విభాగం, అంతరిక్ష విభాగాల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు పిలుపునిచ్చారు.

భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జనజాతీయ గౌరవ్ దివస్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని శాస్త్ర, సాంకేతిక శాఖ (డీఎస్టీ) పరిధిలోని ఎస్ఈఈడీ విభాగం, నార్త్ ఈస్ట్ సెంటర్ ఫర్ టెక్నాలజీ అప్లికేషన్ అండ్ రీచ్ (ఎన్‌ఈసీటీఏఆర్) సంయుక్తంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా గిరిజన సాధికారత కోసం సైన్స్, టెక్నాలజీ, ఆవిష్కరణలపై టెక్నాలజీ సంపుటిని, బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ఆదర్శమూర్తుల్లో భగవాన్ బిర్సా ముండా ఒకరని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఆయన గిరిజన వర్గాల ధైర్యం, ఆత్మగౌరవం, ఆకాంక్షలకు ప్రతీక అని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధి దిశగా సాగే ప్రయత్నాలకు ఆయన జీవితం, సేవలు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని మంత్రి తెలిపారు.

అడవులు, నదులు, పర్వతాలతో మమేకమై జీవనం సాగిస్తున్న గిరిజన సమాజాలను జీవవైవిధ్య సంరక్షకులుగా మంత్రి అభివర్ణించారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి గిరిజన విజ్ఞానం, ఆచారాలు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని, అదే సమయంలో డిజిటల్ విద్య, స్టెమ్ శిక్షణకు సంబంధించిన భారతదేశ ప్రయాణంలో నాయకత్వం వహించేలా గిరిజన యువతకు సహాయపడతాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ముఖ్యంగా ఈశాన్య ప్రాంతంలో జీవనోపాధి కల్పనకు, స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయడానికి నైపుణ్యాలు, మార్గదర్శకత్వం, ఆర్థిక సహాయం, మార్కెట్ అనుసంధానాల మద్దతుతో కూడిన సాంకేతిక ఆధారిత సంస్థలు అవసరమని మంత్రి అన్నారు.

వికసిత్ భారత్?2047 దార్శనికతను సాధించడానికి గిరిజన వర్గాలకు... ముఖ్యంగా మారుమూల, భౌగోళికపరమైన సవాళ్లతో కూడిన ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి సాధికారత కల్పించడం అవసరం అని మంత్రి అన్నారు.

స్థానిక పరిస్థితులకు అనువైన, తక్కువ ఖర్చుతో లభించే, సులభంగా నిర్వహించగల సాంకేతిక పరిజ్ఞానాల ఆవశ్యకత గురించి కేంద్ర మంత్రి వివరించారు. సికిల్ సెల్ అనీమియా గురించి మాట్లాడుతూ సీఎస్ఐఆర్-ఐజీఐబీ, న్యూఢిల్లీలోని ఎయిమ్స్, హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్?ఐఐసీటీ, ముంబయిలోని ఎన్ఐఐ, ఇతర సంస్థలు భాగమైన బహుళ సంస్థాగత సీఆర్ఐఎన్ఫ్రార్-సీఏఎస్9 జన్యు చికిత్స ప్రయత్నం గురించి డాక్టర్ సింగ్ ప్రస్తావించారు.

షెడ్యూల్డ్ తెగల వర్గాలకు అండగా నిలిచేందుకు గత కొన్నేళ్లుగా ప్రొఫెసర్ ఉమేష్ వి. వాఘ్మారేతో పాటు శాస్త్ర సాంకేతిక విభాగం గణనీయమైన కృషి చేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ముఖ్యంగా అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాలకు చెందిన 75,000 మందికి పైగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చిన 124 కొత్త ప్రాజెక్టుల గురించి, దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 ప్రత్యేక సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ (ఎస్‌టీఐ) హబ్‌ల గురించి వివరించారు. వివిధ రాష్ట్రాల్లో పదకొండు ఎస్సీ, ఎస్టీ సెల్స్ కూడా ఏర్పాటు చేశారు. సహజ వనరుల నిర్వహణ కార్యక్రమాల ద్వారా షెడ్యూల్డ్ తెగలకు చెందిన 20,000 మందికి పైగా సభ్యులు లబ్ధి పొందారు.

షెడ్యూల్డ్ తెగలకు చెందిన కనీసం ఒక వ్యవస్థాపకుడు ఉన్న అంకురసంస్థలను ప్రోత్సహించేందుకు నిధి టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (టీబీఐ) హబ్‌ల ఏర్పాటు కోసం డీఎన్‌టీ ప్రతిపాదనలను కూడా ఆహ్వానించిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ వర్గాల్లో వెలుగులోకి తీసుకురావాల్సిన అపారమైన ప్రతిభ ఉందన్నారు. వారు దాతృత్వాన్ని కాకుండా న్యాయంగా తమకు దక్కాల్సిన అవకాశాలను మాత్రమే కోరుకుంటున్నారని డాక్టర్ సింగ్ అన్నారు. ఇన్‌స్పైర్-మానక్ కార్యక్రమంలో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న షెడ్యూల్డ్ తెగల విద్యార్థులు 21,087 మంది పాల్గొన్నారని వెల్లడించారు. ఈ పురస్కార గ్రహీతల్లో ఎక్కువ మంది వారే ఉన్నారని తెలియజేశారు.

భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి, జాతీయ అభివృద్ధికి దోహదపడిన ఇతర గిరిజన నాయకులను స్మరించుకోవడానికి, గిరిజన వర్గాల సహకారాన్ని గుర్తించే సందర్భమే జనజాతీయ గౌరవ్ దివస్ అని డీఎస్టీ కార్యదర్శి ప్రొఫెసర్ ఉమేష్ వి. వాఘ్మారే అన్నారు. దేశ సుస్థిరాభివృద్ధికి సమాజంలోని అన్ని విభాగాలతో పాటు గిరిజన వర్గాలతో కలిసి పనిచేయడం చాలా అవసరమని ఆయన అన్నారు.

భారతదేశపు బలమైన పరిశోధనా వ్యవస్థను, టెక్నాలజీలను పెద్ద ఎత్తున ప్రజలకు అందించగల దేశ సామర్థ్యాన్ని భారత ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు ప్రొఫెసర్ అజయ్ సూద్ వివరించారు. రుటాగ్, గ్రామీణ స్మార్ట్ విలేజ్ సెంటర్ల గురించి తెలియజేస్తూ... జీవనోపాధిని, స్థానిక ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసే సాంకేతికత ఆధారిత సంస్థలకు గిరిజన వర్గాలు, మహిళలు, స్థానిక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నాయకత్వం వహించగలరని అన్నారు

ఈ సందర్భంగా నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో గిరిజన వర్గాలకు లబ్ధి చేకూరేలా డీఎన్‌టీ, ఎన్ఈసీటీఏఆర్ తోడ్పాటుతో చేపట్టిన ప్రాజెక్టుల ద్వారా అభివృద్ధి చేసిన వినూత్న సాంకేతిక పరిజ్ఞానాలు, చర్యలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డీఎస్‌టీ, ఇతర సంస్థలు, భాగస్వాములను డాక్టర్ జితేంద్ర సింగ్ అభినందించారు. అలాగే, భారతదేశ శాస్త్రీయ, సాంకేతిక పురోగతి వల్ల కలిగే ప్రయోజనాలను దేశంలోని ప్రతి మూలకూ, సమాజంలోని ప్రతి వర్గానికీ చేరేలా చూడాల్సిన అవసరాన్ని ఆయన పునరుద్ఘాటించారు.

57వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఈశాన్య చిత్రసీమకు ప్రత్యేక గుర్తింపు

న్యూఢిల్లీ, నవంబర్ 19:ఈశాన్య భారత వైవిధ్యభరితమైన సంస్కృతి, హృదయాన్ని హత్తుకునే కథలు, విలక్షణమైన సినిగళాలు 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) వేదికపై ప్రత్యేక గుర్తింపు పొందనున్నాయి. ప్రతిష్టాత్మక 'ఇండియన్ పనోరమా' విభాగానికి ఈ ప్రాంతం నుంచి ఏకంగా నాలుగు చిత్రాలు ఎంపికయ్యాయి. ఈ నెల 20 నుంచి 28 వరకు గోవాలో జరగనున్న ఈ చిత్రోత్సవంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందిన రెండు ఫీచర్ ఫిల్మ్‌లు, రెండు నాన్-ఫీచర్ ఫిల్మ్‌లను ప్రదర్శించనున్నారు. ఇవి ఆ ప్రాంతపు దేశీయ వారసత్వం, సామాజిక మార్పులు, ప్రజల రోజువారీ జీవితాలను ప్రేక్షకుల కళ్లకు కట్టనున్నాయి.

ఫీచర్ ఫిల్మ్‌ల ఎంపికలో 'ఉరుమ్' (స్పిరిట్) చిత్రం అగ్రస్థానంలో నిలిచింది. ఐఎఫ్ఎఫ్ఐలో 'ఇండియన్ పనోరమా' విభాగానికి ఎంపికైన తొలి న్యిషి భాషా చిత్రంగా ఇది చరిత్ర సృష్టించింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన దుయు తబ్యో దర్శకత్వం వహించిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్... ఈ చిత్రోత్సవంలో తొలిసారి వరల్డ్ ప్రీమియర్‌గా ప్రదర్శితం కానుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఒక మారుమూల పర్వత గ్రామంలో సాగే ఈ కథ... తన చిన్నారి కుమార్తెను కోల్పోయిన తర్వాత భ్రమలు, అపరాధ భావనతో సతమతమయ్యే ఓ తండ్రి నేపథ్యంలో సాగుతుంది. దీని ద్వారా స్థానిక ప్రజల జ్ఞాపకాలు, మానసిక వేదన, దాగి ఉన్న నిజాలను ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.

ఫీచర్ ఫిల్మ్ విభాగంలో వరల్డ్ ప్రీమియర్‌గా ప్రదర్శనకు సిద్ధమవుతున్న 'డీ రుమ్' సరసన అస్సామీ డ్రామా చిత్రం 'సూర్యముఖి' (సన్‌ఫ్లవర్) నిలిచింది. నటి, దర్శకురాలు, రంగస్థల కళాకారిణి అంతరా జి.జి. చౌదరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. నగర నేపథ్యంలో సాగే ఈ కథ... కలిసి పనిచేసే పుష్పల్, ప్రార్థన అనే ఇద్దరు యువ నర్సుల మధ్య ఉండే పోటీతత్వం క్రమంగా స్నేహంగా, ఆపై ప్రేమగా మారుతుంది. అయితే, దారిలో దొరికిన ఒక డబ్బుల సంచీ వారి జీవితాల్లో అనూహ్యమైన నైతిక సందిగ్ధతలకు దారితీస్తుంది. ఆ పరిస్థితి వారి నిర్ణయాలను, అనుబంధాలను ఎలా పరీక్షించిందన్నదే ఈ చిత్ర కథాంశం.ఇండియన్ పనోరమా నాన్-ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అస్సాం, మిజోరం రాష్ట్రాలకు చెందిన రెండు విలక్షణమైన కథలు చోటు దక్కించుకున్నాయి. పురస్కార గ్రహీత, ప్రముఖ చిత్రనిర్మాత ఐమీ బారువా రచించి, దర్శకత్వం వహించిన 30 నిమిషాల అస్సామీ డాక్యుమెంటరీ 'రెడ్ కార్పెట్'... సంప్రదాయ చేనేత కళా నైపుణ్యాల శాశ్వత వారసత్వాన్ని చాటిచెబుతుంది. అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్ కొండల నేపథ్యంలో సాగే ఈ చిత్రం... డోంకామోకం గ్రామానికి చెందిన ఒక కర్బీ చేనేత కళాకారిణి కేన్స్ చిత్రోత్సవ రెడ్ కార్పెట్‌పై అడుగుపెట్టిన అసాధారణ ప్రయాణాన్ని చూపిస్తుంది. ఆమె జీవిత కథ ద్వారా స్థానిక కళాకారుల పట్టుదల, కర్బీ నేతపని సంప్రదాయాల గొప్పతనం, పూర్వీకుల హస్తకళలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ఈ డాక్యుమెంటరీ ప్రధానంగా ప్రదర్శిస్తుంది.

నాన్-ఫీచర్ విభాగంలో ఎంపికైన మరో చిత్రం 'చలో ఇండియా విత్ ఎరిక్ జీ - మిజోరం'. రాజ్‌దీప్ చౌదరి దర్శకత్వం వహించిన 48 నిమిషాల ఈ ఆంగ్ల డాక్యుమెంటరీ... బ్రిటిష్ మాజీ పార్లమెంటు సభ్యుడు, చరిత్ర ఉపాధ్యాయుడు అయిన ఎరిక్ ఒల్లెరెన్‌షా ఓబీఈ మిజోరం సామాజిక, సాంస్కృతిక వైభవాన్ని అన్వేషించే క్రమంలో సాగుతుంది. ఈ రాష్ట్రంలోని అత్యధిక అక్షరాస్యత స్థాయిలు, పౌరుల్లో క్రమశిక్షణ, ఉత్సాహభరితమైన ఫుట్‌బాల్ సంస్కృతిని ఇది కళ్లకు కడుతుంది. వ్యాపారం, విద్య, సామాజిక నాయకత్వంలో మిజో మహిళలు అందిస్తున్న విశేష సేవలను ఈ చిత్రం ప్రత్యేకంగా చాటిచెబుతుంది.



గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

భక్తులకు ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి
బాసర ఆలయ పునర్నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్

ఆదిలాబాద్, నవంబర్ 19:గోదావరి పుష్కరాల సందర్భంగా చేపడుతున్న అభివృద్ధి పనులను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు

. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఘాట్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన పనులను ముందస్తుగానే పూర్తి చేయాలని సూచించారు.

గురువారం బాసర ఆలయ ఈవో కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, ప్రతి శాఖ అధికారి తమ పర

ఇఫి 2026లో కన్నడ, తుళు సినిమాలకు ప్రాధాన్యత గిరీష్ కాసరవల్లి 50 ఏళ్ల సినీ ప్రస్థానంపై ప్రత్యేక దృష్టి

న్యూ ఢిల్లీ, నవంబర్ 19:గిరీష్ కాసరవల్లి సామాజిక స్పృహతో కూడిన సమాంతర సినిమాల నుంచి సమకాలీన కుటుంబ కథాచిత్రాలు, జానపద నేపథ్య ఇతిహాసాలు, డాక్యుమెంటరీ కథనాల వరకు.. కన్నడ, తుళు సినిమాల గొప్పదనం, వైవిధ్యాన్ని గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం(ఇఫి) ప్రత్యేకంగా ప్రదర్శిస్తోంది.

రిషబ్ శెట్టి దర్శకత్వం వహించి, ప్రధాన పాత్రలో నటించిన 'కాంతార: ఎ లెజెండ్-చాప్టర్ 1' కథ కదంబుల కాలం నేపథ్యంలో సాగుతుంది. బెర్మే అనే యువ అటవీ వాసి పొరుగున ఉన్న బంగ్రా రాజ్యంలోకి ప్రవేశించి, అక్కడి పాలకులు అటవీ ప్రాంత ప్రజల పట్ల చూపుతున్న కఠిన వైఖరిని చూస్తాడు. యువరాజు కులశేఖర గిరిజనుల పై దాడి చేసి, వారిలో చాలామందిని హతమార్చినప్పుడు, న్యాయం, ధర్మం కోసం జరిగే పోరాటంలో బెర్మే వారితో కలుస్తాడు. జానపద సంప్రదాయాలు, విశ్వాసం, అటవీ ప్రాంత ప్రజల రక్షణ కోసం జరిగే పోరాటాన్ని ఈ చిత్రం సమ్మిళితం చేస్తుంది. ఈ చిత్రం భారతీయ పనోరమా మెయిన్‌స్ట్రీమ్ సినిమా విభాగంతోపాటు అంతర్జాతీయ పోటీ విభాగంలోనూ ప్రదర్శనకు ఎంపికైంది.

వీ శేషాద్రి దర్శకత్వం వహించిన 'రూబీ-క్యూబ్' చిత్రం.. కొండ ప్రాంతంలోని ఒక పర్యాటక ప్రదేశంలో స్వల్ప విహారయాత్రకు వెళ్లిన కుటుంబంలోని మూడు తరాల కథను చెబుతుంది. మానసిక వైద్య నిపుణురాలైన రోహిణి, వైవాహిక జీవితంలో సమస్యలు ఎదుర్కొంటున్న కుమార్తె చిత్ర ద్వారా తనకు దూరమైన భర్త మూర్తిని మళ్లీ కలుసుకుంటుంది. కుటుంబ సభ్యులంతా కలిసి సమయం గడుపుతున్న క్రమంలో పాత విభేదాలు, పరిష్కారం కాని భావోద్వేగాలు తెరపైకి వస్తాయి. సంబంధాల్లోని సంక్లిష్టతలకు రూబిక్స్ క్యూబ్ ప్రతీకగా నిలుస్తుంది. సహనం, పరస్పర అవగాహన ఉంటే సమస్యల నుంచి బయటపడేందుకు మార్గం కనుగొనవచ్చనే విషయాన్ని ఈ చిత్రం చూపిస్తుంది.

డాక్టర్ ప్రదీప్ కెంచనూరు (డాక్టర్ ప్రదీప్ కుమార్ శెట్టి కె) దర్శకత్వం వహించిన 'ది హగ్ ఆఫ్ ఎంప్టీనెస్' చిత్రం చంద్రశేఖర్ కథను వివరిస్తుంది. రుణాన్ని తిరిగి చెల్లించలేకపోవడంతో 2003లో సుళ్య సహకార బ్యాంకు ఆయన ఆస్తిని స్వాధీనం చేసుకుంది. ఈ చర్య అన్యాయమని భావించిన చంద్రశేఖర్ న్యాయపోరాటం ప్రారంభిస్తాడు. అది రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతుంది. శాశ్వత నివాసం లేకపోవడంతో న్యాయం కోసం పోరాడుతూనే తన కారులో నివసిస్తుంటాడు. అనిశ్చిత భవిష్యత్తు ఎదురైనా, ఆయన సాగించిన సుదీర్ఘ పోరాటం, ఒంటరితనం, పట్టుదలను ఈ డాక్యుమెంటరీ చిత్రీకరిస్తుంది.

అభిషేక్ దర్శకత్వం వహించిన 'ఉలిదిద్దు సంపిగె మాత్ర' (మిగిలింది పువ్వు మాత్రమే) చిత్రం. తాను ప్రేమించిన మహిళను కోల్పోయి, ఆమె జ్ఞాపకాలతో ఒంటరిగా జీవిస్తున్న మంజన కథను చెబుతుంది. ఆమె ఫొటో దెబ్బతినడంతో, ఒక చిత్రకారుడిని సంప్రదించి, తన జ్ఞాపకాల ఆధారంగా ఆమె చిత్రపటాన్ని మళ్లీ గీయాలని కోరతాడు. ఆ చిత్రపటాన్ని అందుకున్న తర్వాత మంజన ఒక రహస్యమైన వ్యక్తిని కలుస్తాడు. అనూహ్యంగా ఎదురైన ఆ పరిచయం అతను తన గతాన్ని చూసే దృక్పథాన్ని మారుస్తుంది. ఊహించని ముగింపు దిశగా అతడిని నడిపిస్తుంది. నష్టాన్ని, జ్ఞాపకాలను, భావోద్వేగ మార్పులను ఈ లఘుచిత్రం ఆవిష్కరిస్తుంది.

అనుపమ శారధి దర్శకత్వం వహించిన 'పిలి చన్నె' చిత్రం.. తన అమ్మమ్మ నుంచి సంప్రదాయ మూలికా వైద్యాన్ని నేర్చుకున్న ఒక గిరిజన మహిళ కథను వివరిస్తుంది. మరణించే ముందు అమ్మమ్మ, అడవిలోని వైద్య పరిజ్ఞానాన్ని తనలో నిక్షిప్తం చేసుకుందని నమ్మే పవిత్రమైన రాయిని ఆమెకు అందిస్తుంది. తన వైద్య నైపుణ్యంతో సమాజానికి సేవ చేస్తూ ఆమె ప్రజల విశ్వాసాన్ని పొందుతుంది. అయితే, అత్యాశ కలిగిన గ్రామ వైద్యుడు, గ్రామ పెద్ద ఆ రాయిని తమ సొంతం చేసుకోవాలని ప్రయత్నించినప్పుడు, దానిని ఇచ్చేందుకు ఆమె నిరాకరిస్తుంది. సంప్రదాయ జ్ఞానం, ధైర్యం, పూర్వీకుల నుంచి సంక్రమించిన విజ్ఞాన పరిరక్షణ అంశాలను ఈ చిత్రం ప్రతిబింబిస్తుంది. 2026 ఇఫిలో ఈ చిత్రం ప్రపంచ ప్రీమియర్ ప్రదర్శనకు సిద్ధమవుతోంది.

2026 ఇఫిలో భాగంగా నవంబర్ 21న 'సమాంతర సినిమా నైతిక ప్రపంచం: గిరీష్ కాసరవల్లి 50 ఏళ్ల ప్రస్థానం' పేరుతో ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. నమన్ రామచంద్రన్ సమన్వయం చేసే ఈ కార్యక్రమంలో ప్రశంసలు పొందిన కన్నడ దర్శకుడు గిరీష్ కాసరవల్లి అయిదు దశాబ్దాల సినీ ప్రస్థానాన్ని సమీక్షించనున్నారు. ఆయన తొలి చిత్రం 'ఘటశ్రద్ధ' నుంచి 'తబరన కథే', 'తాయి సాహెబా', 'ద్వీప' వంటి చిత్రాల వరకు.. సామాజిక అన్యాయం, నైతిక నిర్ణయాలు, అణగారిన వర్గాల జీవితాలను ఆయన చిత్రాలు ఆవిష్కరించాయి. కథలను తెరకెక్కించడంలో ఆయన అనుసరించిన విధానం, సినిమా-సామాజిక స్పృహ మధ్య ఉన్న సంబంధాలపై ఈ చర్చలో విశ్లేషించనున్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం

అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు


370 మంది లబ్ధిదారులకు రెండో విడత మంజూరు పత్రాల పంపిణీ



కరీంనగర్, నవంబర్ 19: పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 370 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గురువారం జగిత్యాల పట్టణంలోని బందారి గార్డెన్స్‌లో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదవాడికి సొంత ఇల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. గత పాలనలో ఇళ్ల కోసం ఎదురుచూసిన ప్రతి అర్హుడికి ఇందిరమ్మ రాజ్యంలో ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సంక్షేమ పథకాలు పేదల ఇంటి ముంగిటకే వస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో నాణ్యమైన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అర్హత ఉన్నా ఇంకా దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారెవరూ మిగిలిపోకుండా చూస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు

. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కొలుగూరి దామోదర్ రావు, సందీప్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ అబ్బారి మల్లేశం గౌడ్, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ రవిబాబు, జిల్లా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు భూమారెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, అధికారులు, లబ్ధిదారులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చికిత్స కోసం రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరు

బింగి లలిత కుటుంబానికి అందజేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

కరీంనగర్, నవంబర్ 19: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బింగి లలితకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరైంది.

అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు చికిత్స చేయించేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో స్థానిక నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఎల్ఓసీ మంజూరు చేయించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో లలిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, సర్పంచ్ హరీష్, నాయకులు శ్రీనివాసరావు, డిల్లీ రామారావు, నలువాల సురేష్, సర్పంచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్ఎఫ్ఐ-2026లో మెరిసిన హిమాలయ కథలు: లదాఖ్, కాశ్మీర్ చిత్రాలకు ప్రత్యేక గుర్తింపు

న్యూ ఢిల్లీ, నవంబర్ 19:హిమాలయ ప్రాంతపు పర్వతాలు, బౌద్ధ మఠాలు, మంచుతో కప్పి ఉన్న గ్రామాలు, సజీవ హస్తకళలు గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) వేదికగా ఆవిష్కృతం కానున్నాయి. లదాఖీ, కాశ్మీరీ భాషల్లో తెరకెక్కిన రెండు ఫీచర్, రెండు నాన్-ఫీచర్ చిత్రాలు అక్కడి ప్రకృతి అందాలను, సంప్రదాయాలను, సామాన్యుల జీవిత కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాయి. ముఖ్యంగా... ఇండియన్ పనోరమా నాన్-ఫీచర్ విభాగంలో ప్రారంభ చిత్రంగా ప్రదర్శించనున్న లదాఖీ లఘుచిత్రం 'బికమింగ్' ఈ ప్రత్యేక ప్రదర్శనకు నాంది పలకనుంది.

లీనా యాదవ్ రచన, దర్శకత్వంలో రూపొందిన 11 నిమిషాల లదాఖీ లఘు చిత్రం 'బికమింగ్'... ఇండియన్ పనోరమా నాన్-ఫీచర్ విభాగంలో ప్రారంభ చిత్రంగా ప్రదర్శితమవుతోంది. లదాఖ్ నేపథ్యంలో సాగే ఈ కథ... రిన్‌చెన్ అనే యువ తల్లి, పసితనం నుంచే ప్రకృతితో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్న ఆమె కుమారుడు అగ్యల్ చుట్టూ తిరుగుతుంది. ఏడేళ్ల వయసులో అగ్యల్‌కు వింత దృశ్యాలు కనిపించడం, పురాతన లికిర్ బౌద్ధ మఠం వైపు ఆకర్షితుడవడం, గత జన్మకు సంబంధించిన జ్ఞాపకాలు గుర్తుకురావడం జరుగుతుంది. ఆ మఠంలోని ఒక తాళం వేసిన గదిలో గల పెట్టెను అగ్యల్ గుర్తించడంతో, అందులోని వస్తువులను చూసిన బౌద్ధ సన్యాసులు అతడిని ఒక గౌరవనీయ 'రింపోచే' పునర్జన్మగా విశ్వసిస్తారు. అగ్యల్ ఆధ్యాత్మిక ప్రయాణం మొదలయ్యే క్రమంలో పునర్జన్మ, విధి, గతం-వర్తమానం-భవిష్యత్తుల మధ్య సంబంధాలను ఈ చిత్రం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. రిన్‌చెన్ ఆంగ్మో, త్సెరింగ్ వాంగ్‌గ్యిల్ ఇందులో నటించారు. 'పార్చ్‌డ్', 'రాజ్మా చావల్', 'హౌస్ ఆఫ్ సీక్రెట్స్' వంటి పురస్కార చిత్రాలతో పాటు ఆస్కార్ కోసం నామినేట్ అయిన 'టెల్ ఇట్ లైక్ ఎ ఉమెన్' చిత్రానికి పనిచేసిన ప్రముఖ దర్శకురాలు, నిర్మాత లీనా యాదవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

సాహిల్ షా దర్శకత్వంలో రూపొందిన 85 నిమిషాల లదాఖీ ఫీచర్ ఫిల్మ్ 'బర్డ్స్ ఆన్ ఐస్'... ఇండియన్ పనోరమా ఫీచర్ ఫిల్మ్స్ విభాగంతో పాటు ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు కేటగిరీకీ ఎంపికైంది. గొర్రెల కాపరులైన తన తల్లిదండ్రుల రాక కోసం ఎదురుచూస్తూ... తాతయ్య వద్ద పెరుగుతున్న తాషి అనే లదాఖ్ బాలిక చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒకరి వద్ద నుంచి అరువు తెచ్చుకున్న ఐస్-హాకీ స్కేట్స్ ఆమె చేతికి అందడంతో ఆమెలో ఓ కొత్త కల మొలకెత్తుతుంది. కఠినమైన హిమాలయ చలికాలంలో ఎదుగుతున్న క్రమంలో... కుటుంబం, విషాదం, మనుగడకు సంబంధించిన చేదు నిజాలను తాషి తెలుసుకుంటుంది. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా, తన ప్రాణ స్నేహితుడితో కలిసి తన కలను సాకారం చేసుకునేందుకు ఆమె తనదైన మార్గాన్ని ఎంచుకుంటుంది. తాషి పాత్రలో సెమ్జాంగ్ స్కిట్‌డన్ నటించగా... ఎన్. చోపాల్, కుంగా చోస్కియాబ్, పద్మ చోరోల్, సోనమ్ స్టోబ్‌గైస్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. షాన్ పస్రీచా రచన చేయగా, కామియో ఫిల్మ్స్ నిర్మించింది. ఐస్-హాకీ క్రీడాకారుల స్ఫూర్తితో సాహిల్ షా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్ ఇది.

రాజా షబీర్ మహమ్మద్ ఖాన్ దర్శకత్వంలో రూపొందిన 75 నిమిషాల కాశ్మీరీ ఫీచర్ ఫిల్మ్ 'స్లెడ్జ్'... ఐఎఫ్ఎఫ్ఐ-2026 వేదికపై ఆసియా ప్రీమియర్‌గా ప్రదర్శితం కానుంది. ఇండియన్ పనోరమా విభాగంలో చోటు దక్కించుకున్న ఈ చిత్రం... భారతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు పురస్కారం కోసం పోటీపడుతోంది. గుల్మార్గ్ సమీపంలోని ఓ మంచుతో కప్పి ఉండే గ్రామంలో నివసించే అలీ కుటుంబానికి మంచుపై లాగే ఓ బండి మాత్రమే ఏకైక జీవనాధారం. అలీ కొన్ని రోజుల పాటు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో... అతడి ముగ్గురు పిల్లలైన హాజిక్, ఈషెల్, రైమా ఆడుకుంటూ అనుకోకుండా ఆ బండిని విరగ్గొడతారు. తండ్రి తిరిగి వచ్చేలోపు దానిని బాగు చేయించాలనే తాపత్రయంతో ఆ చిన్నారులు గుల్మార్గ్ పర్యాటక ప్రాంతంలో డబ్బు సంపాదించేందుకు ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో ఎన్నో తిరస్కారాలను, నిశ్శబ్ద అవమానాలను ఎదుర్కొంటారు. సరిగ్గా అప్పుడే వారికి డబ్బు, చాక్లెట్లతో నిండిన బ్యాగ్ దొరుకుతుంది.

తమ సమస్యకు పరిష్కారం దొరికిందనుకునే లోపే... ఆ డబ్బును వాడుకోవాలనే ఆశకు, తమ అంతరాత్మకు మధ్య ఆ పిల్లలు నలిగిపోతారు. రాజా ఖాన్... సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ పూర్వ విద్యార్థి. గతంలో ఆయన రూపొందించిన 'షెపర్డ్స్ ఆఫ్ పారడైజ్' డాక్యుమెంటరీకి జాతీయ పురస్కారం లభించింది. రిహానా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రంలో హాజిక్ మహమ్మద్ ఖాన్, ఈషెల్ ఖాన్, రైమా ఖాన్ ప్రధాన పాత్రలు పోషించారు.

ఎల్లలు లేని కథా ప్రపంచం: ఇఫీ 2026లో తమిళ, తెలుగు చలన చిత్రాల విశ్లేషణ

న్యూ ఢిల్లీ, నవంబర్ 19:57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో (ఇఫీ) తమిళ, తెలుగు చలనచిత్రాలు ప్రముఖంగా నిలిచాయి. ఇవి సామాజిక సమస్యలు, కుటుంబ సంబంధాలు, మానవీయ విలువలు, వ్యక్తిగత పోరాటాలు, సాంస్కృతిక సంప్రదాయాలను అన్వేషించే విభిన్నమైన కథనాలను ఆవిష్కరిస్తున్నాయి. ఫీచర్, నాన్-ఫీచర్ విభాగాల్లో రెండు భాషల కథలను ఒకే వేదికపైకి తెచ్చిన ఈ కథలు.. సాంకేతికత, విద్య నుంచి పర్యావరణ పరిరక్షణ, కుటుంబ బంధాలు, వ్యక్తిగత ఆకాంక్షలు, రాజకీయ జీవితం వరకు విస్తరించిన ఇతివృత్తాలపై దృష్టి సారిస్తున్నాయి.

తమిళ చిత్రాల జాబితాలో సమకాలీన, సాంప్రదాయ సామాజిక నేపథ్యాలతో కూడిన కథలు ఉన్నాయి. కన్నన్ ఎస్ దర్శకత్వం వహించిన స్క్రోల్ చిత్రం స్మార్ట్‌ఫోన్ వ్యసనానికి బానిసైన అరవింద్ అనే యువకుడి చుట్టూ తిరుగుతుంది. అతను 'డోపా రష్' అనే యాప్‌లో చేరిన తర్వాత అతని జీవితం కలవరపరిచే మలుపు తీసుకుంటుంది. వరుస టాస్కలు, బహుమతుల ద్వారా స్మార్ట్‌ఫోన్ వ్యసనాన్ని అధిగమించాలని ఈ యాప్ వినియోగదారులకు సవాలు విసురుతుంది. అయితే ఈ సవాళ్లు క్రమంగా వింతగా, భయానకంగా మారడంతో ఆ గేమ్ పాల్గొనేవారి జీవితాలను తన నియంత్రణలోకి తీసుకోవడం ప్రారంభిస్తుంది. తద్వారా వ్యసనం నుంచి బయటపడాలనే ప్రయత్నం కాస్తా ఒక భయానక అనుభవంగా మారుతుంది.

శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహించిన 'తాయ్ కిళవి' (గాడ్ మదర్) చిత్రానికి కుటుంబ సంబంధాలు, పరిష్కారం కాని విభేదాలు ప్రధాన ఇతివృత్తాలుగా ఉన్నాయి. ఒక చిన్న గ్రామంలో తన కుమార్తె, మనవడితో కలిసి నివసిస్తున్న 70 ఏళ్ల దృఢ సంకల్పం గల 'పావునుతాయి' అనే మహిళ కథను ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. కొందరికి భయంగాను, మరికొందరికి గౌరవప్రదంగాను కనిపించే ఆమె చాలా ఏళ్లుగా తన ముగ్గురు కుమారులకు దూరంగా ఉంటోంది. ఆమె అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆమె కుమారులు తిరిగి ఇంటికి వస్తారు. ఇది పరిష్కారం కాని కుటుంబ విభేదాలు, బాధాకరమైన జ్ఞాపకాలను మళ్లీ తెరపైకి తెస్తుంది. గతం మళ్లీ ఆవిష్కృతం కావటంతో దీర్ఘకాలంగా దాగి ఉన్న ఒక రహస్యం క్రమంగా వెలుగులోకి వచ్చి తమ సంబంధాల పట్ల ఆ కుటుంబానికి ఉన్న ఆలోచనను మార్చేస్తుంది.

విద్యను అందుబాటులోకి తీసుకురావడం అనే అంశాన్ని ప్రస్తావిస్తూ సత్యశివ దర్శకత్వం వహించిన 'అరివు' చిత్రం 1996 నేపథ్యంలో సాగుతుంది. పశ్చిమ కనుమలలోని ఒక మారుమూల గిరిజన గ్రామంలో ఉపాధ్యాయుడిగా నియమితులైన కదిర్ అనే యువకుడి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆడపిల్లలకు చదువు చెబితే గ్రామ దేవతకు ఆగ్రహం కలుగుతుందనే గ్రామస్థుల విశ్వాసం కారణంగా అక్కడ బాలికలకు విద్యనందించటం లేదని అతను గుర్తిస్తాడు. దీనిని మార్చాలని దృఢంగా నిశ్చయించుకున్న అతను ఇంతకుముందెన్నడూ పాఠశాలకు వెళ్లని 13?14 ఏళ్ల వయస్సు గల బాలికల బృందానికి రహస్యంగా పాఠాలు బోధిస్తాడు. పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ కదిర్ వారి భయాలను, సామాజిక ఆంక్షలను అధిగమించడంలో సహాయపడి వారు చదువుకునేందుకు మొదటి అడుగులు వేయడానికి మార్గం సుగమం చేస్తాడు.

తమిళ చిత్రాల ఎంపికలో దేశీయ విజ్ఞానం, సంప్రదాయ పద్ధతుల అన్వేషణ కూడా ఉంది. విజీష్ మణి దర్శకత్వం వహించిన 'అట్టపాడి' చిత్రం కేరళలోని పశ్చిమ కనుమలలో నివసించే ఆదివాసీ తెగల సంప్రదాయ వైద్య పద్ధతులను విశ్లేషిస్తుంది. అట్టపాడి ప్రజలు సంరక్షిస్తున్న ఔషధ విజ్ఞానం, అటవీ సంప్రదాయాలను అన్వేషించడానికి అరేబియా నుంచి వచ్చిన సుల్తాన్ అహ్మద్ అల్ మెహమూదీ చుట్టూ ఈ చిత్రం తిరుగుతుంది. దర్శకుడు విజీష్ మణి మార్గదర్శకత్వంలో అతను సంప్రదాయ వైద్యులు, పెద్దలను కలిసి అడవితో వారికి ఉన్న అనుబంధం గురించి తెలుసుకుంటాడు. ఔషధ విజ్ఞానం కోసం అన్వేషణగా ప్రారంభమైన ఈ ప్రయాణం.. క్రమంగా ఆ సమాజపు జీవన విధానం, సాంస్కృతిక వారసత్వంలోకి సాగే ఒక అంతర్గత ప్రయాణంగా రూపుదిద్దుకుంటుంది.

జోయల్ విజయ్ దర్శకత్వం వహించిన 'గూడు' (నెస్ట్) చిత్రానికి పర్యావరణ పరిరక్షణ, సామాజిక భాగస్వామ్యం ప్రధాన ఇతివృత్తాలుగా ఉన్నాయి. తమిళనాడులోని వాచాతి నేపథ్యంలో సాగే ఈ కథలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలోని ఒక ట్రాన్స్‌ఫార్మర్ లోపల గుడ్లతో కూడిన పిచ్చుక గూడు ఉన్నట్లు బయటపడుతుంది. గ్రామ పెద్ద అగస్త్యన్ నాయకత్వంలో వ్యవసాయ పట్టభద్రుడు కదిర్, గ్రామస్థులు ఆ పక్షులను రక్షించడానికి 35 రోజుల పాటు విద్యుత్ లేకుండా ఉండాలని నిర్ణయించుకుంటారు. వ్యక్తిగత కక్షలతో ప్రేరేపితులైన స్థానిక వీఏవో, లింగం అనే వ్యక్తి నుంచి వీరి నిర్ణయానికి తీవ్ర వ్యతిరేకత, విధ్వంసక ప్రయత్నాలు ఎదురవుతాయి. ఈ సవాళ్ల మధ్య ఆ గూడును సురక్షితంగా ఉంచడానికి కదిర్, గ్రామస్థులు కఠినమైన త్యాగాలు చేస్తారు.

తెలుగు చిత్రాల జాబితాలో పర్యావరణ సమస్యలు, కుటుంబ సంబంధాలు, ప్రేమ, వ్యక్తిగత ఆశయాలు, మానవీయ విలువలు, రాజకీయాలకు సంబంధించిన కథలు ఉన్నాయి. సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన 'సింగ్ గీతం' చిత్రం ప్రతాప్ మన్నెం అనే వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. తన తండ్రి వదిలివెళ్లిన బంగారు గనులలో తన వాటాను దక్కించుకోవడానికి అతను 'కుబేరపురం' అనే మైనింగ్ గ్రామానికి తిరిగి వస్తాడు. అక్కడ గనుల విస్తరణ ప్రణాళికలతో గ్రామంలోని చివరి చెట్టును కూడా నాశనం చేయడానికి సిద్ధమైన ఒక మాజీ వ్యాపార భాగస్వామితో ప్రతాప్‌కు విభేదాలు తలెత్తుతాయి. దురాశ, ఘర్షణలు పెరుగుతున్న క్రమంలో ప్రతాప్ తన కుటుంబ గతానికి సంబంధించిన నిజాలను తెలుసుకుని పరివర్తన చెందడం ప్రారంభిస్తాడు. చివరకు గ్రామస్థులు.. ఐక్యత, త్యాగం, ప్రకృతిని కాపాడుకునేందుకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తిస్తారు.

అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'మన శంకర వరప్రసాద్ గారు' (అవర్ మిస్టర్ శంకర్ వరప్రసాద్) చిత్రంలో కుటుంబ సంబంధాలు, ఎడబాటు, తిరిగి కలవడం వంటి అంశాలు ఉన్నాయి. ఈ కుటుంబ కథా చిత్రం శంకర్ వరప్రసాద్ అనే అంకితభావం గల జాతీయ భద్రతా అధికారి చుట్టూ తిరుగుతుంది. అతను తన కుటుంబానికంటే విధినే మిన్నగా భావించడం వల్ల తన భార్య, పిల్లలకు దూరమవుతాడు. ఆరేళ్ల తర్వాత తన పిల్లలు చదువుతున్న పాఠశాలలో విధుల్లో చేరడం ద్వారా వారితో తన సంబంధాన్ని తిరిగి పొందేందుకు అతను ప్రయత్నిస్తాడు. తన కుటుంబానికి తీవ్రమైన ముప్పు ఎదురైనప్పుడు వారిని రక్షించే బాధ్యత అతనికి వస్తుంది. ఆ ప్రమాదాన్ని ఛేదించే క్రమంలో అతను తన గతాన్ని దాటుతూ తన ప్రియమైన వారిని కాపాడుకుంటూ వారి నమ్మకాన్ని తిరిగి గెలుచుకోవాల్సి ఉంటుంది.

రవివర్మ నంబూరి దర్శకత్వం వహించిన 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి ప్రేమ, ఎడబాటు ప్రధాన ఇతివృత్తాలుగా ఉన్నాయి. గత సంబంధం తాలూకు బాధ నుంచి బయటపడటానికి కష్టపడుతున్న నివి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అనాథ అయిన స్టీవెన్‌ను ఆమె కలుస్తుంది. అతని ప్రేమ, ఆప్యాయత క్రమంగా ఆమె జీవితంలోకి మళ్లీ సంతోషాన్ని తీసుకువస్తాయి. వారి మధ్య విభేదాలు ఉన్నప్పటికీ వారు ప్రేమలో పడి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. అయితే వారి పెళ్లి రోజే జరిగిన ప్రమాదంలో స్టీవెన్ మరణిస్తాడు. అతని ఆకస్మిక మరణాన్ని అంగీకరించలేక నివి తీవ్ర దుఃఖం, ఆగ్రహంతో కుంగిపోతుంది. ఎప్పటికీ తనతోనే ఉంటానని ఇచ్చిన మాటను కాదని అతను ఎందుకు వెళ్లిపోయాడో అర్థం చేసుకోలేక సంఘర్షణ పడుతుంది.

ధనుష్ దండు దర్శకత్వం వహించిన 'వై, వాణి?' చిత్రం వ్యక్తిగత ఆకాంక్షల సాధనను ప్రధాన అంశంగా ఆవిష్కరిస్తుంది. హైదరాబాద్‌లో ఎడిటర్‌గా పనిచేస్తూ వృత్తిపరమైన జీవితంలో అసంతృప్తితో ఉండే వాణి అనే యువతి కథను ఈ చిత్రం చెబుతుంది. ముంబయిలో ఒక డాక్యుమెంటరీపై పనిచేసే అవకాశం లభించినప్పుడు ఆమె తన చిత్రనిర్మాణ కలను సాకారం చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. అయితే ఆమె తీసుకున్న ఈ నిర్ణయం తన ప్రియుడు అరుణ్, చిత్రనిర్మాత సాహిత్‌లతో ఆమెకు ఉన్న సంబంధాలలో సవాళ్లను సృష్టిస్తుంది. ఆ ప్రాజెక్ట్.. వారి రాజీలు వారి సొంత భయాలను ప్రతిబింబిస్తుంది. కుటుంబ అంచనాలు, అపరాధ భావనతో సంఘర్షణ పడుతూనే వాణి చివరకు తన నిర్ణయాల పట్ల సరికొత్త అవగాహనను పొంది తన కలను అనుసరిస్తుంది.

ప్రవీణ్ దర్శకత్వం వహించిన 'విన్' చిత్రం చదరంగం ఆట ద్వారా ఆలోచనా విధానం, స్వీయ-క్రమశిక్షణకు ఉన్న ప్రాముఖ్యతను అన్వేషిస్తుంది. తల్లి వద్ద ఏళ్లపాటు కఠిన శిక్షణ పొందిన తర్వాత తాను ఆడే ప్రతి చదరంగం ఆటలో గెలవాలని కోరుకునే 18 ఏళ్ల నెపోలియన్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. తన సామర్థ్యంపై ఎంతో నమ్మకంతో ఒక పెద్ద చదరంగం టోర్నమెంట్‌లోకి అడుగుపెట్టిన నెపోలియన్.. ప్రశాంతంగా ఆలోచించే గాయత్రి అనే పదేళ్ల బాలిక చేతిలో ఓడిపోతాడు. ఆ ఓటమిని అంగీకరించలేక అతను ఆమెకు మరోసారి సవాలు విసురుతాడు. గెలుపు కంటే ఆటను బాగా ఆడటమే ముఖ్యమని గాయత్రి అతనికి అర్థమయ్యేలా చెబుతుంది. ఫలితంపై ఆసక్తి లేకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని ప్రోత్సహిస్తూ ఆమె నెపోలియన్‌కు భగవద్గీత బోధనలను పరిచయం చేస్తుంది. నెపోలియన్ క్రమంగా తన అహాన్ని నియంత్రించుకొని చదరంగాన్ని కొత్త కోణంలో చూడటం నేర్చుకుంటాడు.

దేవా కట్టా దర్శకత్వం వహించిన 'మాయసభ' చిత్రానికి లేదా వెబ్‌సిరీస్‌కు రాజకీయం, భావజాలం, స్నేహం నేపథ్యంగా నిలుస్తాయి.

వాతావరణ మార్పును తగ్గించడంలో పెద్ద పులుల సంరక్షణ ఓ ప్రభావవంత పద్ధతి కాగలదన్న కేంద్ర పర్యావరణ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్

న్యూ ఢిల్లీ, నవంబర్ 19:వాతావరణ మార్పును తగ్గించడంలోను, పర్యావరణీయ దృఢత్వాన్ని పటిష్టపరచడంలోను పెద్ద పులుల సంరక్షణ చర్యలు ప్రధాన పాత్రను పోషిస్తున్నాయని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ అన్నారు. ఆయన ఈ రోజు 'బిగ్ క్యాట్స్: డ్రైవర్స్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ మిటిగేషన్' (వాతావరణ మార్పులను తగ్గించడంలో సహకరిస్తున్న పెద్దపులులు) పేరుతో నిర్వహించిన ఒక ఉన్నత స్థాయి మంత్రుల సమావేశంలో పాల్గొని, ప్రసంగించారు. ఈ సమావేశాన్ని తుర్కియేలోని అంతాల్యాలో యునైటెడ్ నేషన్స్ క్లైమేట్ చేంజ్ కాన్ఫరెన్స్ (సీఓపీ31) నేపథ్యంలో భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, అంతర్జాతీయ పెద్ద పులుల అలయెన్స్ (ఐబీసీఏ) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశంలో.. పెద్ద పులుల నివాస స్థానాలు కలిగివున్న నేపాల్, వెనెజుయేలా, కంబోడియా, శ్రీలంక వంటి దేశాలకు (బిగ్ క్యాట్ రేంజ్ కంట్రీస్) చెందిన మంత్రులు, ప్రతినిధులతో పాటు రామ్‌సర్ కన్వెన్షన్, యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డెజర్టిఫికేషన్ (యూఎన్‌సీసీడీ) వంటి అంతర్జాతీయ సమావేశాలు, సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

వాతావరణ మార్పులను తగ్గింపచేయడం, విస్తారిత అనుబంధ వ్యవస్థ (ఇకోసిస్టమ్) దృఢత్వం, సుస్థిరాభివృద్ధి సాధనలో పెద్ద పులులు, వాటి సహజ ఆవాసాలు అందిస్తున్న తోడ్పాటుపై సంరక్షణ నిపుణులు, ప్రముఖులు ఈ సమావేశంలో సమీక్షించారు. కర్బన సమృద్ధ ఇకోసిస్టమ్‌ల రక్షణ, ఇకోసిస్టమ్ సేవలను బలోపేతం చేయడం, వాతావరణ దృఢత్వాన్ని పెంపొందింప చేయడం, ప్రపంచ వాతావరణ లక్ష్యాల సాధనను ముందుకు తీసుకుపోవడంలో ప్రపంచంలోని ఏడు ప్రధాన పెద్ద పులి ప్రజాతులు, వాటి ఆవాసాల సంరక్షణ ఏ రకంగా దోహదం చేయగలవన్న అంశాలు ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చాయి. ఐబీసీఏతో పాటు, బిగ్ క్యాట్ రేంజ్ దేశాలలో పెద్ద పులుల స్థితిగతులు ఎలా ఉన్నాయన్న అంశంపై ఐబీసీఏ డైరెక్టర్ జనరల్ శ్రీ ఎస్.పి. యాదవ్ ఓ నివేదికను సమర్పించారు. పెద్ద పులుల సంరక్షణకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయత్వంలో భారత్ చేపడుతున్న కార్యక్రమాలు, మరీ ముఖ్యంగా చీతాలకు పునఃప్రవేశ దిశగా చేస్తున్న ప్రయత్నాలను సమావేశంలో పాలుపంచుకున్నవారు ప్రశంసించారు.

శ్రీ యాదవ్ ప్రసంగిస్తూ, ప్రపంచవ్యాప్తంగా పెద్ద పులుల సంరక్షణను ప్రోత్సహించడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిపాదించిన అంతర్జాతీయ పెద్ద పులుల అలయన్స్ (ఐబీసీఏ) భూమికను వివరించారు. ప్రపంచంలో వన్యప్రాణుల సంరక్షణలో సవాళ్లు ఎదురవుతున్న సంగతిని మంత్రి అంగీకరిస్తూ, భారతదేశం విజయవంతంగా అమలు చేసిన సంరక్షణ నమూనాల్ని ఇతర దేశాలతో కలిసి పంచుకొనేందుకు, జ్ఞాన మార్పిడికి మార్గాన్ని సుగమం చేసేందుకు, అంతర్జాతీయ సహకారాన్ని పటిష్టపరిచేందుకు, ప్రపంచం నలుమూలలా పులులకు చెందిన మొత్తం ఏడు ప్రజాతుల సంరక్షణ సామర్థ్యాన్ని పెంచేందుకు ఐబీసీఏ ఒక వేదికను సమకూరుస్తోందన్నారు. రాజకీయ నిబద్ధత, బలమైన సంస్థలు, నిరంతర పెట్టుబడి, సామాజిక భాగస్వామ్యం.. ఇవి పర్యావరణ భద్రత, వాతావరణ మార్పుల పట్ల దృఢత్వం, దీర్ఘకాలిక అభివృద్ధికి వన్యప్రాణుల సంరక్షణను ఒక సాధనంగా ఏ విధంగా మార్చగలవన్నది పులుల సంరక్షణకు భారత్ తీసుకుంటున్న చర్యలే చాటి చెప్తున్నాయని శ్రీ యాదవ్ అన్నారు.

కర్బనమయ భూభాగాలను రక్షించడంలో పెద్ద పులుల సంరక్షణ ప్రభావవంతమైన పద్ధతి కాగలదని మంత్రి స్పష్టం చేశారు. కర్బన పాళ్లను తగ్గించడంలో పులులు ప్రత్యక్షంగా ఎలాంటి తోడ్పాటును అందించకపోవచ్చు గాని కర్బనాన్ని సంగ్రహించే అడవులు, గడ్డిమైదానాలు, తడి నేలలు, పర్వతీయ విస్తారిత అనుబంధ వ్యవస్థలను పులుల సంరక్షణ ప్రక్రియ కాపాడి, తద్వారా సహజస్థలాల క్షీణ స్థితి వెదజల్లే ఉద్గారాలను నిరోధించడంలో, వాతావరణ మార్పుల పట్ల దృఢత్వాన్ని పటిష్టపరచడంలో సహకరించగలుగుతాయని ఆయన అన్నారు. పెద్ద పులులు ఛత్ర ప్రజాతులు (అంబ్రెలా స్పీసీస్) అయిన కారణంగా, సంపూర్ణ పర్యవరణ భద్రతను పెంపొందింపచేయడంలో దోహదం చేయగలవని, ఫలితంగా ఆ భూభాగాలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న వేల కొద్దీ ఇతర ప్రజాతులు, సముదాయాలకు మేలు కలుగుతుందని మంత్రి వివరించారు. ప్రకృతితో ముడిపడిన వాతావరణ మార్పు సంబంధిత కార్యాచరణలో వన్యజీవుల సంరక్షణను అంతర్భాగంగా గుర్తించితీరాలని, ఇది జీవవైవిధ్యం, ఇకోసిస్టమ్, జీవనోపాధి సంబంధిత ప్రయోజనాల్ని అందిస్తూనే ఉద్గారాల్ని తగ్గించే దిశగా చేసే ప్రయత్నాలకు పూరకంగా కూడా నిలవాలని మంత్రి పేర్కొన్నారు.

పులులను సంరక్షించాలన్న లక్ష్యంతో భారత్‌లో మొదలుపెట్టిన కార్యక్రమాలను ప్రకృతి ఆధారిత పరిష్కారాల మార్గాలుగా మంత్రి శ్రీ యాదవ్ వర్ణించారు. దేశంలో పులుల అభయారణ్యాలను యాభై ఎనిమిదింటిని ఏర్పాటు చేశారని, ఈ అభయారణ్యాలు సుమారు 85,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించాయని, ఇవి విశాలమైన అటవీ పర్యావరణ వ్యవస్థతో పాటు ఆయా ప్రాంతాలలో కార్బన్ నిలవలను కాపాడుతున్నాయని ఆయన అన్నారు. ఈ భూభాగాలు కర్బన నియంత్రణ, జల శుద్ధీకరణ, భూసార పరిరక్షణతో పాటు భూగర్భ జలమట్టాల పెంపు సహా కీలక ఇకోసిస్టమ్ సంబంధిత సేవలను అందిస్తున్నాయని మంత్రి వివరించారు. ఈ అభయారణ్యాల్లో 600కు మించిన నదులు ప్రవహిస్తూ పులుల సహజసిద్ధ ఆవాస ప్రాంతాలకు కీలక జలవనరులుగా అలరారుతున్నాయని మంత్రి తెలిపారు. సముదాయాల భాగస్వామ్యం, పర్యావరణ వికాసం, దీర్ఘకాలిక ప్రాతిపదికన జీవనోపాధి కల్పన కార్యక్రమాలు పులుల సంరక్షణకు సమ్మిళితత్వాన్ని, సుస్థిరత్వాన్ని జోడించాయని ఆయన వివరించారు.

పులుల సంరక్షణలో భారతదేశం సాధించిన విజయాల్ని శ్రీ యాదవ్ ప్రస్తావిస్తూ, దీనికి ఖ్యాతి అంతా నిరంతర రాజకీయ నిబద్ధత, బలమైన చట్టాలు, దృఢమైన సంస్థాగత యంత్రాగానిదే అన్నారు. వన్యప్రాణుల (పరిరక్షణ) చట్టం-1972తో పాటు చట్టబద్ధ సంస్థ అయిన 'జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ' (ఎన్‌టీసీఏ) బలపరుస్తున్న 'ప్రాజెక్ట్ టైగర్' ఓ పటిష్ట పాలనాస్వరూపాన్ని అందించాయన్నారు. భారతదేశంలో పులుల సంఖ్య పెరిగి 2022లో 3,682కు చేరిందని, ఇది ప్రపంచంలో వన్య వ్యాఘ్రాల మొత్తం సంఖ్యలో 70 శాతం కన్నా ఎక్కువని వివరించారు. ఈ విజయం కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో నిరంతర కేటాయింపులు, అంకితభావంతో విధులను నిర్వర్తిస్తున్న అటవీ సిబ్బంది, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ, సాముదాయిక నిర్వహణల వల్ల సాధ్యపడిందని తెలిపారు. 'ప్రాజెక్ట్ టైగర్' ఏటా దాదాపు 60 లక్షల వనిదినాల వేర బతుకుతెరువు అవకాశాలను కల్పిస్తోందని, దీంతో పర్యావరణ హితకర జీవనోపాధికల్పనకు తోడు సాముదాయిక జీవనోపాధి భద్రతకు ప్రధాన చోదక శక్తిగా పులుల సంరక్షణ కార్యక్రమం నిలిచిందని మంత్రి అన్నారు.

ఏసీబీ వలలో సర్పంచ్.. క్వారీల నిర్వహణకు రూ.13 లక్షల డీల్ !!

క్వారీల నిర్వహణలో సహకరించేందుకు భారీ లంచం డిమాండ్

రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ..

ఖమ్మం, నవంబర్ 19:గ్రానైట్ క్వారీల నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూస్తానంటూ రూ.13 లక్షలు లంచం డిమాండ్ చేసిన మహబూబాబాద్ జిల్లా సర్పంచ్ ఏసీబీ వలకు చిక్కాడు. ఈ మొత్తంలో మొదటి విడతగా రూ.2 లక్షలు తీసుకుంటుండగా వరంగల్ ఏసీబీ అధికారులు బుధవారం (నవంబర్ 18) ఖమ్మంలో అతడిని పట్టుకున్నారు.

సీరోలు మండలం మోదుగడ్డ తండాకు చెందిన సర్పంచ్ ధరావత్ వీరు ఖమ్మంలోని ఫిర్యాదుదారుడి కార్యాలయంలో నగదు స్వీకరిస్తుండగా అధికారులు ట్రాప్ నిర్వహించారు. శరదా స్టోన్స్, ప్రీమియర్ గ్రానైట్స్, రాశి గ్రానైట్స్ సంస్థలకు చెందిన క్వారీల కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగేందుకు, గ్రానైట్ వ్యాపారం సజావుగా సాగేందుకు అధికారికంగా అనుకూలంగా వ్యవహరిస్తానంటూ వీరు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.

తొలుత రూ.30 లక్షలు అడిగిన ఆయన.. అనంతరం ఆ డిమాండ్‌ను రూ.13 లక్షలకు తగ్గించినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా తొలి విడత సొమ్ము రూ.2 లక్షలు తీసుకునేందుకు అంగీకరించినట్లు ఏసీబీ పేర్కొంది.

ఫిర్యాదుదారుడి కార్యాలయంలో రూ.2 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ బృందం దాడి చేసి వీరును పట్టుకుంది. ట్రాప్ ప్రక్రియలో లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అధికారిక హోదాను దుర్వినియోగం చేసి, విధులను నిజాయితీగా నిర్వహించకుండా అక్రమంగా లబ్ధి పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ పేర్కొంది. నిందితుడు ధరావత్ వీరును అరెస్టు చేసి, వరంగల్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ వెల్లడించింది.

మునుగోడు అభివృద్ధికి నిధులిస్తారా..

మునుగోడుపై వివక్ష చూపొద్దు..

ప్రజాధనం కాపాడే మనిషిని.. తినే మనిషిని కాదు

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నల్గొండ, నవంబర్ 19: మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించకపోతే మరో కురుక్షేత్రానికి సిద్ధం కావాల్సి ఉంటుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ అంటే కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలే కాదని, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మునుగోడు ప్రజలు ఆత్మగౌరవం ఉన్న దమ్మున్న నాయకుడిని గెలిపించారని, అడుక్కుతినే నాయకుడిని ఎన్నుకోలేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. మునుగోడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలోని మునుగోడు, గట్టుప్పల్, మర్రిగూడ, నాంపల్లి, చండూరు మండలాలు, చండూరు మున్సిపాలిటీ పరిధిలో ఎంపికైన 3,630 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.

దరఖాస్తు చేసుకున్న వారిలో 90 శాతం మందికి పింఛన్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. ప్రభుత్వ సొమ్ము పేదలకు చేరాలే తప్ప అనర్హులకు, సంపన్నులకు కాదని స్పష్టం చేశారు. రైతుబంధు కూడా నిజంగా వ్యవసాయం చేసే రైతులు, కౌలు రైతులకు అందించాలని సూచించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చామని, దానిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పింఛన్ మొత్తాన్ని రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచినా తప్పులేదని, ప్రతి మండల కేంద్రంలో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గత ప్రభుత్వం చేసిన అవినీతిని బయటపెట్టి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. మునుగోడు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనులు ప్రారంభమైనప్పటికీ, ఆరు నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు అందక పనులు నిలిచిపోతున్నాయని రాజగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. కొడంగల్‌కు రూ.10 వేల కోట్లు కాదు.. రూ.20 వేల కోట్లు ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని, మునుగోడుకు కూడా తగిన నిధులు కేటాయించాలని అన్నారు.

వైరా గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్

విద్యార్థినుల చదువుపై ఆరా..

పాఠశాల వసతులు, నిర్వహణపై సమీక్ష



ఖమ్మం, నవంబర్ 19: ఖమ్మం జిల్లా వైరాలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)ను జిల్లా కలెక్టర్ టీఎన్ దివాకర సందర్శించారు. పాఠశాలలోని సౌకర్యాలు, నిర్వహణ తీరును సమీక్షించారు. పాఠశాల విస్తీర్ణం ఎంత ఉందని అడిగి తెలుసుకోగా, 14 ఎకరాల విస్తీర్ణంలో రెండు కుంటలు ఉన్నాయని ప్రిన్సిపాల్ పాసుంగలపాటి రాధిక వివరించారు. అనంతరం వంటగది, సరుకుల గది, బియ్యం నిల్వ గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశుభ్రత, సరుకుల నిల్వ, నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో కలియతిరుగుతూ తొమ్మిదో తరగతి విద్యార్థినులతో ముచ్చటించి వారి చదివే సామర్థ్యాన్ని పరీక్షించారు. మంచి పఠన అలవాట్లు, భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని విద్యార్థినులను ప్రోత్సహించారు. పాఠశాల నిర్వహణ, నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. కలెక్టర్ ప్రశంసలు ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఆరోగ్యకరమైన అభ్యాస వాతావరణాన్ని కొనసాగిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్సీవో సీహెచ్ రాంబాబు, ప్రిన్సిపాల్ పాసుంగలపాటి రాధిక, ఎమ్మార్వో సురేష్‌బాబు, ఎంఈవో చావా శ్రీనివాసరావు, వీఆర్వో మస్తాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైరా, ఆంధ్రప్రభ : వైరాలోని మాటూరుపేటలో ఉన్న రెండు ఎకరాల ఎన్ఎస్పీ స్థలాన్ని కలెక్టర్ దివాకర పరిశీలించారు. అనంతరం బీసీ హాస్టల్‌ను సందర్శించి వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. బీసీ హాస్టల్‌లోని గదులను కమ్యూనిటీ హాల్‌కు కేటాయించాలని వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి, స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తానని తెలిపారు. అనంతరం వెజ్ మార్కెట్, పరిసర ప్రాంతాలను పరిశీలించి వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

చిన్న నీటి చెరువుల అభివృద్ధికి చర్యలు

వి.బి.జి. రామ్‌జీ పథకం కింద పునరుద్ధరణ పనులు

ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత, శిఖం హద్దుల పరిరక్షణకు ప్రాధాన్యం



నల్గొండ, నవంబర్ 19: జిల్లాలోని చిన్న నీటి చెరువులన్నింటినీ వి.బి.జి. రామ్‌జీ పథకం కింద పునరుద్ధరించి, పటిష్టం చేసే పనులను శుక్రవారం నుంచే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు భూగర్భ జలాల అభివృద్ధికి ఈ పనులు దోహదపడతాయని తెలిపారు.గురువారం కలెక్టరేట్‌లో మైనర్ ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీరు తాగునీటి అవసరాలకే సరిపోతుందని, మూసీ నదిలో నీరు ఉన్నప్పటికీ అది తాగేందుకు అనుకూలంగా లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించుకోవడంతోపాటు వర్షపు నీటిని చెరువుల్లోకి మళ్లించి భూగర్భ జలాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇప్పటికే గుర్తించిన చెరువుల కింద మంజూరైన వసులన్నింటినీ వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఫీడర్ ఛానళ్ల మరమ్మతులు, పూడికతీత, చెరువుల శిఖం హద్దుల వద్ద కందకాల తవ్వకం, ఒండ్రుమట్టి తీసే ప్రాంతాల్లో ముళ్లపొదల తొలగింపు వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను ప్రారంభించాలని స్పష్టం చేశారు. ఇకపై ప్రతి వారం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

రామాంజనేయ కాలనీలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

100 ఇళ్ల తనిఖీ.. 11 వాహనాలు సీజ్.. అక్రమ మద్యంపై నాలుగు కేసులు



ఖమ్మం, నవంబర్ 19: జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం తెల్లవారుజామున చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామాంజనేయ కాలనీలో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 100 ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. 54 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలను తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 45 వాహనాలపై జరిమానాలు విధించగా, 15 వాహనాలకు సంబంధించి జరిమానాలు వసూలు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ మద్యం వ్యవహారంలో నాలుగు కేసులు నమోదు చేశారు.

అనంతరం కాలనీవాసులతో సమావేశమైన కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ముఖ్యంగా యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మంత్రాలు, చేతబడుల పేరుతో జరిగే మోసాలకు గురికావద్దని, మూఢనమ్మకాలను వీడి శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు భరోసా లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు లక్ష్మి, వెంకటేశ్వర్లు, యాసీన్, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఎస్ఐలు, పోలీసు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌డీసీసీ బ్యాంక్ 104వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

నిజామాబాద్, సెప్టెంబర్ 19: నిజామాబాద్‌లో ఎన్‌డీసీసీ బ్యాంక్ 104వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో గురువారం పలు సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సంద ర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి. లక్ష్మీనారాయణ, బ్యాంకు సీఈవో నాగ భూషణం వందే, జీవీంలు అను పమ, శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. సీఈవో స్వయంగా రక్తదానం చేయగా, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా విలువలను చాటుకున్నారు.సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బ్యాంకు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లా కోర్టు చౌరస్తా, పాస్‌పోర్టు కార్యాలయం మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరికీ తెలియజేయకూడదని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సామాజిక బాధ్యతలో భాగంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు స్కూల్ కిట్లు, వండ్లు, అవసరమైన వస్తువులను అందజేశారు. చింతకుంటలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వారితో కొంతసేపు గడిపి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో బ్యాంకు సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. గత 104 సంవత్సరాలుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులు, ఖాతాదారులకు ఎన్‌డీసీసీ బ్యాంకు విశిష్ట సేవలందిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోంది. బ్యాంకింగ్ సేవలతో పాటు సామాజిక బాధ్యతను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తోంది. బ్యాంకు సిబ్బంది అంకితభావం, ఖాతాదారుల ఆదరణతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులు, ఖాతాదారులు, శ్రేయోభిలాషులు, సహకార కుటుంబ సభ్యులందరికీ 104వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



వైద్యులకు రోగులకు వారధులు ఫార్మసిస్టులు

ప్రజలు, ప్రభుత్వాలు ఫార్మసిస్ట్ ల గురుతర సేవలను గుర్తించటానికి, ఫార్మసిస్ట్ లు తమను తాము పునరంకితం చేసికొనటానికి ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఏ) నవంబర్ మూడవ వారాన్ని జాతీయ ఫార్మసీ సప్తాహం గా ప్రతి ఏటా పాటిస్తున్నది. అంటే జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నవంబర్ 16, నుండి నవంబర్ 22 వరకు ఏటా జరుపుకుంటారు. ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మరియు ఢిల్లీ ఫార్మాస్యూటికల్ ట్రస్ట్ సంయుక్తంగా వృత్తిపరమైన ఔషధ తయారీదార్ల ప్రతిష్ఠను పెంచడమే లక్ష్యంగా వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఔషధం లేనిది చికిత్స లేదు. ఔషధ పరిశోధన, ఆవిష్కరణ, ఉత్పత్తి, పంపిణీ, నిలువ, వితరణ, పర్యవేక్షణ, గుణదోష నిర్ధారణ వంటి అన్ని దశలు ఫార్మసిస్ట్ ల పరిధిలోని అంశాలు. భారతదేశంలో 11.25 లక్షల ఫార్మసిస్ట్ లు నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్నారు. దేశంలోని ఫార్మసిస్ట్ లందరికి 1939లో ఏర్పడిన ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్ (ఐపిఏ) ప్రాతినిధ్యం వహిస్తున్నది.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని డ్రగ్ టెక్నికల్ అడ్వైసరీ బోర్డ్ సభ్యురాలుగా ఐ పి ఏ ప్రభుత్వానికి మార్గదర్శనం చేస్తుంది.

ఐరోపా ఖండ వాసుల వలసలతోనే దేశంలోనికి అలోపతి వైద్యం ప్రవేశించింది. ఫార్మసి వృత్తి బ్రిటన్ లో అపోతెకరీ నుంచి, కెమిస్ట్ డ్రగిస్ట్ వంటి దశలను దాటి ఫార్మసిస్ట్ గా పరిణమించింది. దేశంలో మొదటి అలోపతి జెనరల్ హాస్పిటల్ 1664లో మద్రాస్ లో ఏర్పాటు కాగా, మొదటి కమ్యూనిటి ఫార్మసి 1811లో కోల్‌కతాలో ప్రారంభం అయింది. ఆసియా లోనే తొలి ఫార్మసి కళాశాల గోవా లోని పంజింలో 1842లో పోర్చుగీస్ ప్రభుత్వం వారిచే ప్రారంభమైంది.

ఆరోగ్యంపై ప్రతి వారికీ శ్రద్ద ఉండడం సహజం. ఆరోగ్యం కోసం ప్రపంచంలోని ప్రతి ఒక్కరూ నానా పాట్లు పడుతుంటారు. చికిత్స కన్నా, నివారణే నయమని, ఇప్పుడిప్పుడే చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఏ చిన్నపాటి రోగం వచ్చినా, వెంటనే మందులు తీసుకుంటున్నారు. ఆరోగ్య మెరుగుదలలో మందులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇంతకూ మందులను ఎవరు మెరుగు పరుస్తారో, ఎవరు తయారు చేస్తారో తెలుసా? ఫార్మాసిస్టులు. వైద్య బృందంలో ఫార్మసిస్టుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. చికిత్స, ఉత్పత్తులను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా రోగులకు ఆరోగ్య సేవలను మెరుగు పరచడం ఔషధ నిపుణుల ప్రాథమిక లక్ష్యం.

వాస్తవానికి ఫార్మాసిస్టు రెండో వైద్యుడిగా పరిగణించ బడతాడు. రోగులకు కావాల్సిన మందులను, ఏ రోగికి ఎంత మోతాదులో కావాలో నిర్ధారిస్తాడు. అంతేకాదు వాటి వల్ల ప్రయోజనాలు

నవంబర్ 16నుండి 22... జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

కలిగేలా చేస్తాడు. దుష్ప్రభావాలు కలగకుండా మార్గ నిర్దేశాలు చేస్తాడు. క్లినికల్ ఫలితాలను మెరుగు పరచడానికి మందులు వాటి వాడే పద్ధతిని, సురక్షితమైన వాడకాన్ని కూడా ప్రోత్సహిస్తాడు. ప్రపంచం లోని ప్రతి ఒక్క రోగికీ అందరికీ సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు అందించేందుకు అనుక్షణం ఫార్మా సిస్టులు కృషి సల్పుతారు. ఔషధాల వాడకాన్ని మెరుగు పరచి, రోగుల భద్రతను నిర్ధారించే మరియు పరిరక్షించేందుకు ఫార్మాసిస్టులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రజల ఆరోగ్య భద్రత రీత్యా మెడిసిన్స్ లోని లోపాలను తగ్గించేందుకు ఫార్మా సిస్టులు ఎక్కువగా కృషి చేస్తారు. ఫార్మాసిస్టులు వారి విస్తృత జ్ఞానం మరియు నైపుణ్యాన్ని ప్రజల ఆరోగ్యాల కోసం ఉపయోగిస్తారు. ఏ ఒక్క రోగిని హాని కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందనే విషయాన్ని అనుక్షణం గుర్తుంచుకుని, పని చేస్తారు. వారు తయారు చేసిన మెడిసిన్స్ నుండి ఉత్తమ ఫలితం వచ్చేలా చాలా కృషి చేస్తారు. చాలా మంది వారి పని, తాము సూచించిన మందులను అప్పగించడమే అనుకుంటారు. కానీ జ్ఞానం, అనుభవ పరంగా వారు డాక్టర్ కంటే ఏ మాత్రం తక్కువ కాదు. ఫార్మాసిస్టులకు మెడిసిన్స్, వాటి దుష్ప్రభావాల గురించి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ప్రధానంగా వైద్యుల వద్దకు వెళ్లలేని, వైద్యం చేయించు కోలేని నిరు పేదలకు, ఔషధాలను అందించడం లోనూ వారు ఎక్కువ బాధ్యత వహిస్తారు.

ఫార్మాసిస్టును కూడా ఒకరకంగా వైద్యుడి లాగే తెల్లటి కోటు ధరించి, మందులు పంపిణీ చేసే ఆరోగ్య సంరక్షక నిపుణుడిలా భావించ వచ్చు. కాని ఔషధ పంపిణీకి మించి ఫార్మాసిస్టు పాత్ర విస్తరిస్తుందని మనం తెలుసుకోవాలి. రోగులకు హాని లేదా మరణానికి మరో ప్రధాన కారణం ఔషధ లోపం అని కొన్ని అధ్యయనాలు చెపుతున్నాయి. లోపం తరచుగా శాశ్వత అవయవ నష్టం, పక్షవాతం లేదా మరణానికి దారి తీస్తుంది. ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ 2009 ఇస్తాంబుల్ (టర్కీ)లో జరిగిన వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ ఫార్మసీ అండ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో గుర్తించింది. 1912 సంవత్సరం లోనే సెప్టెంబర్ 25న ఫార్మాసిస్టు డే జరుపు కోవడానికి ఎంపిక చేయ బడి, అప్పటి నుండి ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ ప్రారంభించ బడింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వ్యాప్తంగా కనీసం 2.6 మిలియన్ ఫార్మసిస్టులు ఇతర ఫార్మాస్యూటికల్ సిబ్బంది ఉన్నట్లు అంచనా వేసింది. ఆరోగ్య కరమైన జీవనానికి సలహా ఇవ్వడం, వ్యాధిని నివారించడానికి టీకాలు వేయడం మందులు సరిగ్గా తీసుకునెలా చూడడం, తద్వారా వ్యాధులను చక్కగా నయం చేయడం, జీవిత నాణ్యతను మెరుగు పరచడం, సురక్షితమైన మరియు సమర్థ వంతమైన మందులు మరియు వ్యాక్సిన్లను అభివృద్ధి చేయడం ద్వారా ఔషధ శాస్త్రవేత్తలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న సేవలు అమోఘం. జాతీయ ఫార్మాసిస్ట్ వారోత్సవం అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అందరూ ఫార్మాసిస్టుల సేవలను గుర్తించి, ఔషధ తయారీ నుండి, పలసిన వారికి పంపిణీ, మందులు వాడే విధానం వరకు, అసమాన, అమూల్య సేవలు అందిస్తున్న, వారి ప్రతిభావంత మైన పాత్రకు సముచిత గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలి. ప్రధానంగా ప్రస్తుత పరిస్థితులలో కరోనా వైరస్ యొక్క వ్యాప్తిని ఆపడానికి ఫార్మసిస్ట్లు అవిశ్రాంతంగా కృషి వెల కట్టలేనిది. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం, పంపిణీ చేయడం, కుటుంబ సభ్యులకు దూరంగా, స్వార్థం మరిచి, మానవ సేవే పరమార్థంగా, ఈ క్లిష్ట సమయంలో ఫార్మసిస్టులు చేస్తున్న సేవలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించి, కృతజ్ఞతలు ప్రకటించాల్సిన సమయం ఇది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ముఖ్యమంత్రి బహిరంగ సభకు వేములవాడ నుండి భారీగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 19:(నేటినిజం ప్రతినిధి):. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, వేములవాడ మున్సిపల్ చేర్మెన్ పుల్కం రాజు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తూము మధు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సిద్ధిపేటలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు వేములవాడ పట్టణం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లడం జరిగింది.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు, ఆది శ్రీనివాస్ గారి నాయకత్వంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగుతూ సభను విజయవంతం చేయడానికి తరలివెళ్లినట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్ లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

అచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి

నిజామాబాద్, సెప్టెంబర్ 19:నిజామాబాద్ రైల్వే స్టేషన్ పార్కింగ్ ఆవరణలో అనారోగ్యంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఒకటవ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? రైల్వే స్టేషన్ పార్కింగ్ ఏరియాలో సుమారు 50 నుండి 60 సంవత్సరాల వయస్సు గల ఒక అజ్ఞాత వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఒకటవ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనారోగ్య సమస్యల కారణంగానే సదరు వ్యక్తి మృతి చెంది ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడికి తెల్ల గడ్డం, తెల్లటి జుట్టు ఉండి, ఒంటిపై గళ్ల చొక్కా (చెక్ షర్ట్), నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) మార్చురీలో భద్రపరిచారు.ఈ ఆనవాళ్లు కలిగిన వ్యక్తి గురించి ఎవరికైనా తెలిసినా, లేదా అతని బంధువులు ఎవరైనా ఉన్నా తక్షణమే నిజామాబాద్ ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గానీ, లేదా 8712659714 ఫోన్ నంబర్‌లో గానీ సంప్రదించాలని పోలీసులు కోరారు.



భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

వివాహేతర సంబంధం కోసం భార్యకు వేధింపులు నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

కరీంనగర్, నవంబర్ 19: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలో ఈ నెల 9వ తేదీన వివాహిత శ్రావంతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఆమె భర్త కొత్తూరి సంపత్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లాకు చెందిన ఇమ్మడి ముత్తయ్య తన కుమార్తె శ్రావంతిని సుమారు 11 సంవత్సరాల క్రితం కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామానికి చెందిన కొత్తూరి సంపత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అయితే గత కొంతకాలంగా సంపత్ వివిధ విషయాల్లో భార్య శ్రావంతిని వేధించేవాడు. అంతేకాకుండా రెండేళ్లుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలానికి చెందిన ఓ మహిళతో పరిచయం పెంచుకొని వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. తనను వివాహం చేసుకోవాలంటే భార్యను వదిలించుకోవాలని సదరు మహిళ సంపత్‌పై ఒత్తిడి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో భార్యను వదిలించుకోవాలనే ఉద్దేశంతో సంపత్ ఆమెను తరచూ వేధించేవాడు.

ఈ నెల 9వ తేదీ రాత్రి సంపత్ తన మొబైల్ ఫోన్‌లో సదరు మహిళతో వీడియో కాల్స్, చాటింగ్ చేస్తుండగా శ్రావంతి గమనించి భర్తను నిలదీసింది. దీంతో తాను మరో మహిళను ప్రేమిస్తున్నానని, ఆమెను వివాహం చేసుకుంటానని చెప్పడంతో పాటు, నువ్వు బతికితే బతుకు.. చస్తే చావు అంటూ దురుసుగా మాట్లాడినట్లు విచారణలో వెల్లడైంది. భర్త ప్రవర్తనతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రావంతి తన భవిష్యత్తుతో పాటు ఇద్దరు కుమార్తెల భవిష్యత్తు ఏమవుతుందోనని ఆవేదన చెందింది. మరుసటి రోజు ఉదయం ఇంట్లోని పిల్లల బెడ్‌రూమ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

ఉదయం సుమారు 8 గంటలకు నిద్రలేచిన సంపత్ భార్య ఉరివేసుకొని ఉండటాన్ని గమనించాడు. అయితే తనపై అనుమానం రాకుండా ఉండేందుకు మొబైల్ ఫోన్‌లోని చాటింగ్స్, మెసేజ్‌లను తొలగించి, బంధువులు, తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారికి సమాచారం అందించి ఏమీ తెలియనట్లు నటించినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. అనంతరం శ్రావంతిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈ ఘటనపై మృతురాలి తండ్రి ఇమ్మడి ముత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు సంపత్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలోని జైలు బంక్ వద్ద సంపత్ ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు.

నిందితుడి మొబైల్ ఫోన్‌ను పరిశీలించగా సిరికొండకు చెందిన మహిళతో జరిపిన చాటింగ్స్, మెసేజ్‌లు, వీడియో కాల్స్‌కు సంబంధించిన వివరాలు బయటపడ్డాయి. వాటి ఆధారంగా సదరు మహిళతో అతడికి వివాహేతర సంబంధం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌తో పాటు, ఆ మహిళను కలుసుకోవడానికి ఉపయోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి సంపత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.



జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో కవితాగానాలు చేసిన కవులను సన్మానిస్తున్న కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి

ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కాదు

లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్, కవి, రచయిత, వక్త

హైదరాబాద్, నవంబర్ 19:ప్రతి వ్యక్తి ఎదుగుదలకు పటిష్టమైన పునాది తాను ఆర్జించిన విద్య, విద్యార్జనకు పేదరికం అడ్డు కాదని, విద్యతో పాటు సంస్కారవంతమైన జీవనశైలిలను అలవర్చుకున్న నేటి యువతీయువకులు రేపటి సుసంపన్న వికసిత భారతానికి నిర్మాతలని ప్రముఖ కాలమిస్టు, విశ్రాంత ప్రిన్సిపాల్, లీడ్ ఇండియా అధ్యక్షులు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు సిరిసిల్ల జిల్లాకు చెందిన రుద్రంగి పిఎమ్ శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాంగణాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడుతూ విజ్ఞాన సమపార్జన ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రతి రోజు, ప్రతి క్షణం తెలియని విషయాలను తెలుసుకోవడానికి కృషి చేయాలని సూచించారు. అర్థం కాని పాఠ్యాంశాలను అడిగి తెలుసుకోవాలని, అజ్ఞానమనే చీకట్లోంచి జ్ఞానమనే వెలుగులోకి రావాలని కోరారు. స్వల్ప, మాధ్యమిక, దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని దశల వారీగా సాధిస్తూ సమోన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, కసితో కృషి చేసి చదువుల తల్లి దీవెనలతో జ్ఞానవంతులు, సద్గుణవంతులు కావాలని మార్గనిర్దేశం చేశారు. లీడ్ ఇండియా-2047 స్వచ్ఛంద సంస్థ బాధ్యులు గాలిపెల్లి నాగేశ్వర్ మాట్లాడుతూ సోషల్ మీడియా, అర్థరహిత సినిమాలు, మాదక ద్రవ్యాలు నేటి యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని తెలిపారు. శ్రీనివాసాచారి చారి, సత్య ప్రకాష్ శిక్షకుల నేతృత్వంలో పాఠశాల పిల్లలకు డిజిటల్ యుగపు సమస్యలు, సవాళ్లను అధిగమించి ఎదగడానికి అవసరమైన మెళకువలకు అందించారు. అనంతరం అతిథులను హెచ్ఎం కె సమ్మి రెడ్డి నాయకత్వంలో పాఠశాల యాజమాన్యం అతిథులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పాఠశాల గ్రంథాలయానికి కెప్టెన్ డాక్టర్ఈ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన పుస్తకాలు బహుకరించారు. సమావేశాల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి వచ్చే వరకు సమావేశంలో పాల్గొనబోం!

మండల సమీక్ష సమావేశాన్ని బహిష్కరించిన ఎనిమిది మంది సర్పంచ్‌లు

గత సమావేశాల్లో ప్రస్తావించినా పరిష్కారం కాని గ్రామాల సమస్యలు

మంత్రి వాకిటి శ్రీహరి స్వయంగా హాజరై సమీక్షించాలని డిమాండ్

మహబూబ్‌నగర్, నవంబర్ 19: మంత్రి వాకిటి శ్రీహరి హాజరయ్యే వరకు మండల స్థాయి సమీక్ష సమావేశాల్లో పాల్గొనబోమని బీజేపీకి చెందిన ఎనిమిది మంది సర్పంచ్‌లు స్పష్టం చేశారు. గతంలో జరిగిన సమావేశాల్లో గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం సమావేశాన్ని బహిష్కరించారు.

సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కొండా సురేఖ

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేస్తామని హామీ

వరంగల్, నవంబర్ 19: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 33వ డివిజన్‌కు చెందిన న్యాలపోగుల సంజయ్‌కుమార్ (60), ఆయన భార్య శోభ (55) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొండా సురేఖ గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో అండగా నిలిచారు. ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పించడంతో పాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్‌రాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మిసాల ప్రకాష్, 33వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తెరశాల శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు కొమ్మరాజుల సందీప్, బొమ్మగాని శ్రీనివాస్, దయాసింగ్, రేవంత్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శంకర్ నాయక్ అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీకి చెందిన ఎనిమిది మంది సర్పంచ్‌లు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం సమావేశ మందిరంలోకి వెళ్లి తమ నిరసనను అధికారులకు తెలియజేశారు.

గతంలో నిర్వహించిన రెండు మండల సమీక్ష సమావేశాల్లో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని సర్పంచ్‌లు తెలిపారు. అయినప్పటికీ వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు సమావేశాల్లో సమస్యలను ప్రస్తావించినా ఫలితం లేకపోవడం బాధాకరమన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర పాడి పరిశ్రమలు, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి స్వయంగా మండల సమీక్ష సమావేశానికి హాజరై గ్రామాల సమస్యలపై సమీక్షించాలని డిమాండ్ చేశారు. మంత్రి వచ్చే వరకు సమావేశాల్లో పాల్గొనబోమని స్పష్టం చేస్తూ అధికారులకు వినతిపత్రం సమర్పించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో స్పందించాలని సర్పంచ్‌లు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎం. రేణుక భరత్, వాకిటి వెంకటేష్, అంజయ్య, తిరుమలేష్, బోయిన్‌పల్లి కాశమ్మ, రేణుక, నర్సిములు, వాణి కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.